


మన
# జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక

MJP NEWS TELUGU

సంపుటి : 6 సంచిక : 40 పేజీలు : 8 వెల : రూ.2/- ఆదివారం 08 మార్చి 2026 వైఎస్సార్ కడప

Circulated by Kadapa, Ananthapur, Chittor, Vishakapatanam, Srikakulam, Elluru, Thirupathi, Ongole, Vijayawada, SPSR Nellore, Prakasham, Guntur, Kurnool






లొంగిన మావోయిస్టులకు ఆర్థిక, ఆరోగ్య భద్రత

130 మంది మావోయిస్టులు లొంగుబాటు

గణపతి కూడా లొంగిపోవాలన్న సిఎం రేవంత్

## శాంతియుత వాతావరణమమే శ్రీరామరక్ష

**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 07:** శాంతియుత వాతావరణంలోనే సమస్యకు పరిష్కారం దొరుకుతుందని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. లొంగిపోయిన మావోయిస్టుల ఆర్థిక, ఆరోగ్య భద్రతకు భరోసా కల్పిస్తాం. ఇంకా అజ్ఞాతంలో ఉన్న మావోయిస్టులు లొంగిపోవాలి. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం అని అన్నారు. 130 మంది మావోయిస్టులు శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎదుట లొంగిపోయారు. దేవ్‌జీకి చెందిన పీఎల్‌జీఏ కమిటీ మొత్తం సరెండర్ మిగతా2లో...

## రాష్ట్రపతినే అవమానిస్తారా ?

ఇది సిగ్గుచేటైన విసయంగా పరిగణిస్తున్నాం


ముర్ముకు బెంగాల్‌లో అవమానంపై మమతపై మోడీ ఆగ్రహం



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 07:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పశ్చిమ బెంగాల్‌లో పాల్గొనాల్సిన అంతర్జాతీయ సంతాల్ కాన్ఫరెన్స్ వేదికను మార్చడం, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ఆ కార్యక్రమానికి గైర్హాజరు కావడంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మిగతా2లో...

## కల్తీ నెయ్యి కేసులో విజయభాస్కర్‌రెడ్డికి చుక్కెదురు

- ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరించిన హైకోర్టు



**అమరావతి,మన జనప్రగతి మార్చి 07:** కల్తీ నెయ్యి కేసులో నిందితుడిగా ఉన్న టీటీడీలో డెయిరీ నిపుణుడు విజయ భాస్కర్‌రెడ్డికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో ఊరట దక్కలేదు. కల్తీ నెయ్యి సరఫరా వ్యవహారంలో ముందస్తు బెయిల్ పిటిషన్‌ను మిగతా2లో...

## ప్రపంచ దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర

- ఎక్కడికి వెళ్లినా భారతీయ నిపుణులు కనిపిస్తారు
- గ్రీన్ ఎనర్జీలో స్వయం సమృద్ధితో పాటు, ఎగుమతికి అవకాశం
- త్వరలో రివర్స్ మైగ్రేషన్ కూడా సాధ్యమే
- సంతానోత్పత్తిని పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉంది
- ఢిల్లీ సదస్సులో ఏపి సిఎం చంద్రబాబు నాయుడు



**న్యూఢిల్లీ,మన జనప్రగతి మార్చి 07:** నిపుణులు, వనరులు ఉన్న చోటుకే అవకాశాలు వెతుక్కుంటూ వచ్చే రోజులు వచ్చాయని, త్వరలోనే 'రివర్స్ మైగ్రేషన్' ప్రారంభమవుతుందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జోస్యం చెప్పారు. గతంలో మన నిపుణులు సిలికాన్ వ్యాలీ వంటి ప్రాంతాలకు వెళ్లడం 'మేధో వలస'గా భావించేవారని, కానీ ఇప్పుడు పరిస్థితులు మారుతున్నాయని ఆయన విశ్లేషించారు. ప్రపంచ గమనంలో భారతీయుల పాత్ర, నాలెడ్జ్ ఎకానమీలో దేశం సాధించబోతున్న ప్రగతిపై ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. అనేక దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర ఉందని సీఎం చంద్రబాబు అన్నారు. ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా భారతీయులు కనిపిస్తారన్నారు. సంస్కరణల వల్లే మన దేశం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ- అబ్జర్వర్ రీసెర్చ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దిల్లీలో నిర్వహించిన 'రైసినా డైలాగ్' సదస్సులో చంద్రబాబు మాట్లాడారు. కేంద్రంతో కలిసి ముందుకెళ్తున్నట్లు చెప్పారు. ఐటీలో భారతీయుల పరిజ్ఞానం అందరికీ తెలిసిందే. డిప్లమసీ, ఫ్లెక్సిబిలిటీ విషయాల్లో భారతీయులకు మంచి పేరుంది. గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా భారత్ దూసుకెళ్తోంది. మన దేశం మిగతా2లో...

## నేడు ఇంద్రకీలాద్రిలో మహాకుంభాభిషేకం

- అమ్మవారిని దర్శించుకున్న మంత్రులు అనిత, అచ్చన్న


2లో

## జగన్ మద్య నిషేధం వెనక అసలు కథ ఇదేనా..?

- ఆంగ్ల పత్రిక కథనాన్ని కోట్ చేసిన లోకేశ్



**అమరావతి,మన జనప్రగతి మార్చి 07:** ఆంధ్రప్రదేశ్ మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి , గత వైసీపీ ప్రభుత్వంపై మంత్రి నారా లోకేశ్ మరోసారి విరుచుకుపడ్డారు. గత ప్రభుత్వం ఇచ్చిన మద్య నిషేధం హామీ గురించి ప్రస్తావిస్తూ.. సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మంత్రి లోకేశ్ సంచలన పోస్ట్ చేశారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన మంత్రి.. 2019 ఎన్నికల్లో జగన్ ఇచ్చిన 'మద్య నిషేధం' హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా అంటూ వ్యాఖ్యలు చేశారు.'ప్రతి నెలా మిగతా2లో...

## తిరుమల లడ్డూపై పదేపదే అవాస్తవాలు

- చంద్రబాబు కుట్ర రాజకీయాలు
- జగన్‌ను ఎదుర్కొనే ధైర్యం లేకనే విమర్శలు
- వైసిపి నేత సజ్జల రామకృష్ణారెడ్డి



**అమరావతి,మన జనప్రగతి మార్చి 07:** వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాజకీయంగా ఎదుర్కోలేక చంద్రబాబు కుట్రలు పన్నుతున్నారని పార్టీ స్టేట్ కో-ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి మండిపడ్డారు. తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారని చంద్రబాబు పదేపదే అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. లడ్డూ ప్రసాదంలో జంతువుల కొవ్వు, కెమికల్ కలిపారని దుష్ప్రచారం చేశారు. వైఎస్సార్సీపీని రాజకీయంగా దెబ్బతీయాలని చంద్రబాబు ఎలాన్. వైఎస్సార్‌సీపీ హయాంలో క్వాలిటీ టెస్టింగ్ ల్యాబ్‌ను తీసుకొచ్చాం. మార్కెట్లో ఫిబ్రవరి 24న కేజీ హెరిటేజ్ నెయ్యి రూ.541 ఉంది. అదే రోజు మార్కెట్‌లో ఇందాపూర్ నెయ్యి రూ.578గా ఉంది. కేజీ అమూల్ మిగతా2లో...

## 99 రోజుల్లో నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

- హౌసింగ్ బోర్డులోని 5వేల రిజిస్ట్రేషన్ల పక్రియ పూర్తిచేయాలి
- పోర్టల్‌ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్,మన జనప్రగతి మార్చి 07:** ప్రజాపాలన- ప్రగతి నివేదిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా హౌసింగ్ బోర్డు పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఐదు వేల రిజిస్ట్రేషన్‌లను క్లియర్ చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. ఈ‌రాష్ట్రంలో ప్రజలకు పారదర్శకంగా వేగవంతమైన సేవలు అందించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు రూపొందించిన రిజిస్ట్రేషన్ పోర్టల్‌ను మంత్రి శనివారంనాడు సచివాలయంలో ప్రారంభించారు. అలాగే తెలంగాణ హౌసింగ్ కార్పొరేషన్ 99 రోజుల కార్యాచరణ ప్రణాళికకు సంబంధించిన పోస్టర్ ను కూడా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి గారు మాట్లాడుతూ గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనకు అనుగుణంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి నివేదిక కార్యక్రమా న్ని విజయవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ 99 రోజుల్లో హౌసింగ్ కార్పొరేషన్, హౌసింగ్ బోర్డ్ నిర్దేశిరచుకున్న లక్ష్యాలను చేరుకునే విధంగా అంకిత భావంతో పనిచేయాలని సూచించారు. హౌసింగ్ బోర్డ్ పరిధిలో ఇండ్లు, ప్లాట్లు, స్థలాలను వాయిదాల రూపంలో కొనుగోలు చేశారని ఇందులో కొంతమంది అసలు మరికొంతమంది వడ్డీలు చెల్లించాలని, ఇంకొంతమంది వాయిదాల మిగతా2లో...

## నీటిపారుదల లస్కర్లకు శుభవార్త

రోజువారీ వేతనం 350 నుంచి 550కి పెంపు

ఏపి ప్రభుత్వం కీలక నిర్ణయం



2లో

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -03-2026

## ప్రపంచ దేశాల అభివృద్ధిలో భారతీయుల పాత్ర

(మొదటి పేజీ తరువాయి)

భవిష్యత్‌లో అనేక దేశాలకు విద్యుత్ ఇస్తుంది. విదేశాలకు వెళ్లే విద్యార్థుల్లో ఎక్కువ శాతం ఏపీ వాళ్లే ఉన్నారు. ప్రస్తుతం అనేక దేశాల్లో వృద్ధులు పెరుగుతున్నారు. దక్షిణాదిలో సంతానోత్పత్తి రేటు 1.5శాతమే ఉంది. 30 ఏళ్ల క్రితం కుటుంబ నియంత్రణ పాటించాలని చెప్పాం. ఇప్పుడు ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది పిల్లలు ఉండాలని చెబుతున్నా. ఇద్దరు కంటే ఎక్కువ మంది పిల్లలు ఉన్నవారికి అనేక ప్రయోజనాలు కల్పిస్తాం. భవిష్యత్‌లో గ్లోబల్ కమ్యూనిటీకి సేవ చేసే సామర్థ్యం భారత్‌కే ఉంది. వృద్ధుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో పాపులేషన్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. విభిన్నంగా ఆలోచించే వారికోసం అమరావతిలో క్రియేటివ్ సిటీ నిర్మిస్తున్నాం. డ్రోన్ సిటీ, ఏరో స్పేస్, ఎలక్ట్రానిక్ సిటీలు కూడా నిర్మిస్తున్నాం. భవిష్యత్‌లో ఆరోగ్య రంగంలో పెను మార్పులు వస్తాయి. త్వరలో డ్రోన్ అంబులెన్స్‌లు కూడా వస్తున్నాయని చంద్రబాబు అన్నారు. ఈ సందర్భంగా ఐటీ రంగం నుండి గ్రీన్ ఎనర్జీ వరకు, జనాభా విధానం నుండి ఏఐ వరకు భవిష్యత్ భారత్ ఎలా ఉండబోతోందో తన విజన్‌ను పంచుకున్నారు. ప్రపంచంలోనే అత్యుత్తమ డిప్లొమాట్లు భారతీయులేనని చంద్రబాబు కొనియాడారు. ఎక్కడికి వెళ్లినా స్థానిక సంస్కృతులతో కలిసిపోవడంలో భారతీయులకు మించిన వారు లేరన్నారు. నవ్యాంధ్రను డేటా సెంటర్ల హబ్‌గా మార్చేందుకు గ్రీన్ ఎనర్జీని పెద్ద ఎత్తున ఉత్పత్తి చేస్తున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. భారత్ ప్రస్తుతం సింగిల్ గ్రిడ్ ద్వారా ఎనర్జీ ట్రాన్స్‌ఫర్మేషన్ సాధిస్తోందని, భవిష్యత్తులో దేశం విద్యుత్తును ఎగుమతి చేసే స్థాయికి ఎదుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీలో గ్రీన్ అమ్మోనియా ఉత్పత్తిపై ప్రత్యేక దృష్టి సారించామని, ఏఐ , క్వాంటం ఏఐ ఆల్గారిథమ్స్ రంగాల్లో యువతకు అపారమైన అవకాశాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. దీనికి నిదర్శనంగా ఇటీవల శిక్షణ కోసం పిలుపునిస్తే 50 వేల మంది యువత రిజిస్టర్ చేసుకున్నారని ఆయన గుర్తు చేశారు. దేశం ఎదుర్కోబోతున్న 'ఏజింగ్' అంటే వృద్ధాప్య జనాభా సమస్యపై చంద్రబాబు గట్టిగా హెచ్చరించారు. గతంలో జనాభా నియంత్రణ గురించి మాట్లాడిన తాను, ఇప్పుడు భవిష్యత్ ప్రమాదాన్ని గుర్తించి 'జనాభా నిర్వహణ' గురించి మాట్లాడుతున్నానని స్పష్టం చేశారు. ఏపీలో ఫెర్టిలిటీ రేటును 1.5 నుండి 2.1కు పెంచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వం తీసుకున్న కీలక నిర్ణయాలను వివరించారు. మూడో బిడ్డ పుడితే రూ. 25 వేల ఆర్థిక సాయంతో పాటు, ప్రతి నెలా రూ. 1,000 అందించాలని నిర్ణయించాం అన్నారు. తల్లిదండ్రులకు ప్రోత్సాహకంగా చైల్డ్ కేర్ లీవ్ వంటి సౌకర్యాలపై ఆలోచన చేస్తున్నాం. గతంలో భారతదేశంలో ఉన్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థ దేశానికి పెద్ద ఆస్తి అని, ప్రస్తుతం మైక్రో ఫ్యామిలీల వల్ల వస్తున్న మార్పులపై ప్రజల దృక్పథం మారాలని ఆయన పిలుపునిచ్చారు.

## నీటిపారుదల లస్కర్లకు శుభవార్త

**అమరావతి,మన జనప్రగతి మార్చి 07:**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని సాగునీటి వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తున్న సిబ్బందికి సీఎం చంద్రబాబు ప్రభుత్వం తీపి కబురు అందించింది. జలవనరుల శాఖలో ఔట్‌సోర్సింగ్ ప్రాతిపదికన విధులు నిర్వహిస్తున్న 'లస్కర్ల' దశాబ్దాల కష్టాన్ని గుర్తించి.. వారి రోజువారీ వేతనాన్ని భారీగా పెంచుతూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో వీరికి అందుతున్న అరకొర వేతనాల స్థానంలో.. గౌరవప్రదమైన జీతభత్యాలను కల్పించడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ప్రస్తుతం జారీ చేసిన జీవో ప్రకారం.. ఇప్పటివరకు లస్కర్లకు చెల్లిస్తున్న రోజువారీ వేతనం రూ.350 నుంచి రూ.550కి పెరిగింది. అంటే ప్రతి రోజూ రూ.200 అదనంగా లబ్ది చేకూరనుంది. నెలకు సగటున లెక్కగడితే.. ఒక్కో కార్మికుడికి సుమారు రూ.6,000 వరకు అదనపు వేతనం లభిస్తుంది. పెరిగిన జీవన ప్రమాణాలు, నిత్యావసర ధరలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఈ సానుకూల నిర్ణయం తీసుకుంది. వ్యవసాయ రంగమే వెన్నెముకగా ఉన్న రాష్ట్రంలో.. సాగునీటి పంపిణీ వ్యవస్థను కంటికి రెప్పలా కాపాడేది లస్కర్లే. వీరు సాగునీటి కాలువలు, తూముల ద్వారా పొలాలకు సక్రమంగా నీటిని విడుదల చేయడం.. షట్టర్ల మూసివేత, ఓపెనింగ్ మరియు గేట్ల నిర్వహణను పర్యవేక్షించడం.. కాలువల గట్టుల పటిష్టతను చూడటం, ప్రమాదకరమైన లీకేజీలను గుర్తించి వెంటనే మరమ్మతులు చేపట్టడం.. ఆఖరి ఆయకట్టు రైతు వరకు నీరు అందేలా నిరంతరం పహారా కాయడం వంటి పనులు చేస్తుంటారు. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న ఈ వేతన పెంపు డిమాండ్‌ను పరిష్కరించడం ద్వారా.. క్షేత్రస్థాయిలో పని చేసే కార్మికుల్లో మనోధైర్యం పెరగనుంది. ముఖ్యంగా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఈ నిర్ణయం ద్వారా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ నిర్ణయం వల్ల వేలాది కుటుంబాలకు ఆర్థిక భరోసా కలగడమే కాకుండా.. సాగునీటి పంపిణీ వ్యవస్థ మరింత సమర్థవంతంగా పనిచేస్తుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## 99 రోజుల్లో నిర్ధేశించిన లక్ష్యాలను చేరుకోవాలి

(మొదటి పేజీ తరువాయి)

గడువు ముగిసిపో యిందని ఈ విధంగా దాదాపు ఐదు వేల మంది తమ ఆస్తులను రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సిఉందని ఈసందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు.దీనిపై మంత్రిగారు స్పందిస్తూ ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా అసలు, వడ్డీ, ప్రస్తుత మార్కెట్ ధరలు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని రిజిస్ట్రేషన్ చేయాలని సూచించారు.

ఈ పోర్టల్ వల్ల ప్రజలు ఎవరూ అధికారుల చుట్టూ తిరగవలసిన అవసరం ఉండదని, పూర్తి సమాచారం పోర్టల్ లోనే ఉంటుందన్నారు. టాయింపుదారులు తమ రిజిస్ట్రేషన్లు, చెల్లింపుల ధృవీకరణ మరియు ఇతర లావాదేవీల పర్యవేక్షణను ఒకే వేదిక ద్వారా సులభంగా పూర్తి చేసుకోవచ్చు.డిజిటల్ విధానం వల్ల పారదర్శకత పెరగడమే కాకుండా, పౌరులకు సేవలు మరింత చేరువవుతాయి. ఇది హౌసింగ్ బోర్డు మరియు అలాటీల మధ్య నమ్మకాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు. సాంకేతికతను అందిపుచ్చుకుని ప్రభు త్వ నిబంధనలకు అనుగుణంగా ప్రజలకు సౌకర్య వంతమైన పాలన అందించడమే ప్రభుత్వ నిబద్ధత అని పేర్కొన్నారు. హౌసింగ్ బోర్డు ఎండీ వీపీ గౌతమ్, సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## డ్రైవర్ హత్య కేసులో కీలక పరిణామం

### అనంతబాబు భార్యకు నాన్‌బెయిలబుల్ వారంట్

**కాకినాడ,మన జనప్రగతి మార్చి 07:** డ్రైవర్ హత్య కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎమ్మెల్సీ అనంత బాబు భార్య అనంత లక్ష్మీ దుర్గపై జిల్లా ఎస్సీ, ఎస్టీ కోర్టు నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. జిల్లా ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి ఈ ఆదేశాలు జారీ చేశారు. కేసుకు సంబంధించి కోర్టు ముందు హాజరు కాకపోవడంతో అనంత లక్ష్మీ దుర్గపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసినట్లు సమాచారం. ప్రస్తుతం అనంత లక్ష్మీ దుర్గ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆమెను పట్టుకునేందుకు పోలీసులు గాలింపు చర్యలు ప్రారంభించారు. ఈ ఘటన తూర్పుగోదావరి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది. కేసు దర్యాప్తు కొనసాగుతున్న నేపథ్యంలో పోలీసులు మరిన్ని వివరాలను సేకరిస్తున్నారు. వైసీపీ ఎమ్మెల్సీ అనంతబాబు డ్రైవర్ హత్య కేసులో ఆయన భార్య అనంత లక్ష్మీదుర్గ అలియాస్ రోజా పాత్ర ఉందని పోలీసులు పేర్కొంటూ అనుబంధ చార్జిషీట్‌ను కోర్టులో దాఖలు చేసిన విషయం విదితమే.. దీంతో ఆమెను ఈ కేసులో ఏ-2గా చేర్చిన పోలీసులు అరెస్టు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించారు. డ్రైవర్ సుబ్రమణ్యం హత్యలో అనంత లక్ష్మీదుర్గ ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు పోలీసులు తమ దర్యాప్తులో గుర్తించినట్లు తెలిపారు. ఈ మేరకు కీలక ఆధారాలను కూడా అనుబంధ చార్జిషీట్‌కు జత చేశారు. ప్రస్తుతం ఆమె పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పోలీసులు ఆమె కోసం గాలింపు చర్యలను ముమ్మరం చేశారు. ఈ డ్రైవర్ హత్య కేసు అప్పట్లో పెద్ద సంచలనం సృష్టించింది. ప్రారంభ దర్యాప్తులో అనంతబాబును మాత్రమే ప్రధాన నిందితుడిగా చేర్చినప్పటికీ, తర్వాతి దర్యాప్తులో ఆయన భార్య పాత్రపై కూడా అనుమానాలు వ్యక్తమయ్యాయి. అయితే ఆ సమయంలో ఆమె పేరు ఎఫ్ఐఆర్ లేదా చార్జిషీట్‌లో చేర్చలేదు. ఇప్పుడు అనంత లక్ష్మీదుర్గపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేయడం ఆసక్తికరంగా మారింది.

## జాతీయ ఎస్సీకమిషన్ ఛైర్మన్‌కు అస్వస్తత

### • అదికారులతో సమీక్ష చేస్తుండగా వాంతులు

**రాజమండ్రి,మన జనప్రగతి మార్చి 07:** రాజమండ్రి పర్యటనలో ఉన్న జాతీయ ఎస్సీ కమిషన్ ఛైర్మన్ కిషోర్ మాక్వానా శనివారం అస్వస్తతకు గురయ్యారు. ఆయన రాజమండ్రిలో విస్తృతంగా పర్యటించారు.

ఈ పర్యటనలో కిషోర్ మాక్వానా.. స్వల్ప అస్వస్థతకు గురికావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. రాజమండ్రిలోని ఓఎన్జీసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, ఓఎన్జీసీ అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. సమావేశం జరుగుతున్న సమయంలోనే కిషోర్ మాక్వానా అస్వస్థతకు గురయ్యారు. ఈ సమావేశంలో ఉండగానే ఆయనకు వాంతులు కావడంతో వెంటనే అధికారులు స్పందించి సమీపంలోని డెల్టా ఆస్పత్రికి తరలించారు.

వైద్యులు పరీక్షలు నిర్వహించగా ప్రస్తుతం ఆయన ఆరోగ్యం క్రమంగా మెరుగుపడుతున్నట్లు సమాచారం. అధికారులు వెంటనే స్పందించడంతో ఎలాంటి ప్రమాదం జరగకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రస్తుతం వైద్యుల పర్యవేక్షణలో కిషోర్ మాక్వానా చికిత్స పొందుతున్నారు.

## గూగుల్ సిఇవో పిచాయ్‌కు భారీ జీతం

### • కంపెనీ లాభాల దృష్ట్యా జీతం 692 మిలియన్ డాలర్లకు పెంపు



**న్యూయార్క్,మన జనప్రగతి మార్చి 07:**గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్ నాయకత్వంలో అల్ఫాబెట్ మార్కెట్ విలువ పైపైకి దూసుకెళుతోంది. కంపెనీ భారీ మొత్తంలో లాభాలు గడిస్తోంది. గతంలో 535 బిలియన్ డాలర్లు ఉన్న మార్కెట్ విలువ ఇప్పుడు 3.6 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంది. ఈ నేపథ్యంలో కంపెనీ ఉన్నతి కోసం ఎంతగానో కృషి చేస్తున్న సుందర్ పిచాయ్‌కి అల్ఫాబెట్ శుభవార్త చెప్పింది. తాజాగా, భారీ మొత్తంలో ప్యాకేజీని ప్రకటించింది. ది ఫైనాన్షియల్ టైమ్స్ శనివారం తెలిపిన వివరాల మేరకు.. పిచాయ్ ప్యాకేజీని రానున్న మూడేళ్లలో 692 మిలియన్ డాలర్లకు పెంచుతూ అల్ఫాబెట్ కీలక నిర్ణయం తీసుకుంది. మన ఇండియన్ కరెన్సీలో దాని విలువ 6,361 కోట్ల రూపాయలు. 692 మిలియన్ డాలర్లలో పిచాయ్ జీతం కేవలం 2 మిలియన్ డాలర్లు మాత్రమే. మిగిలినదంతా పనితీరు ఆధారిత స్టాక్స్ , పరిమిత స్టాక్స్ రూపంలో ఉండనుంది. పిచాయ్‌కి ఇచ్చే పనితీరు ఆధారిత స్టాక్స్ విలువ 126 మిలియన్ డాలర్లుగా ఉంది. పరిమిత స్టాక్స్ ద్వారా పిచాయ్ 84 మిలియన్ డాలర్లు అందుకోనున్నారు. అల్ఫాబెట్ అనుబంధ సంస్థలు వ్యోమోలో 130 మిలియన్ డాలర్ల విలువైన షేర్స్.. వింగ్ ఏవియేషన్‌లో 45 మిలియన్ డాలర్ల విలువైన షేర్లను యజమాన్యం కేటాయించింది. పిచాయ్ నాయకత్వం మీద ఉన్న నమ్మకంతోటే ప్యాకేజీ భారీగా పెంచినట్లు అల్ఫాబెట్ బోర్డ్ పేర్కొంది. కాగా, 53 ఏళ్ల సుందర్ పిచాయ్ 2004లో అల్ఫాబెట్‌లో ఉద్యోగంలో చేరారు. క్రోమ్‌ను అభివృద్ధి చేయటంలో కీలక పాత్ర పోషించారు. అంచెలంచెలుగా ఎదిగి గూగుల్ సీఈఓ స్థానానికి చేరుకున్నారు.

## రాష్ట్రపతినే అవమానిస్తారా ?

(మొదటి పేజీ తరువాయి)

తీవ్ర స్థాయిలో స్పందించారు. ఇది సిగ్గుచేటని, మునుపెన్నడూ జరగలేదని టీఎంసీ పైన, మమతా బెనర్జీ ప్రభుత్వంపైన మండిపడ్డారు. 'ఇది సిగ్గుచేటు వ్యవహారం. గతంలో ఎన్నడూ ఇలా జరగలేదు. ప్రజాస్వామ్యం, గిరిజన వర్గాల సాధికారతకపై నమ్మకం ఉన్న ప్రతి ఒక్కరి నైతికస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఈ చర్య ఉంది. గిరిజన కమ్యూనిటీకి చెందిన రాష్ట్రపతి వెలిబుచ్చిన ఆవేదన దేశ ప్రజల మనసుల్లో అపార దుఃఖాన్ని కలిగించింది' అని సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో మోదీ ట్వీట్ చేశారు. పశ్చిమబెంగాల్‌లోని టీఎంసీ ప్రభుత్వం అన్ని హద్దులు అతిక్రమించిందనీ, రాష్ట్రపతికి జరిగిన అవమానానికి ప్రభుత్వ యంత్రాగానిదే బాధ్యత అని అన్నారు.ఉత్తర బెంగాల్‌లో అంతర్జాతీయ ఆదివాసీ సదస్సుకు హాజరయ్యేందుకు రాష్ట్రపతి సిలిగురికి వెళ్లారు. ప్రోటోకాల్ ప్రకారం రాష్ట్రపతికి ముఖ్యమంత్రి కానీ, మంత్రులు కానీ, సీనియర్ అధికారులు కానీ స్వాగతం పలకాల్సి ఉంది. అయితే అధికారికంగా స్వాగతించడానికి ప్రభుత్వం తరపున ఎవరూ రాలేదు. ముందుగా అనుకున్న సదస్సు వేదికకు భద్రతా కారణాలతో ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వలేదు. ఈ పరిణామాలపై రాష్ట్రపతి అసహనం వ్యక్తం చేశారు. దీనికి కారణం ఏమిటో వారికే తెలియాలని, అయితే తనపై మమత ప్రభుత్వంపై ఎలాంటి ద్వేషంలేదని, ఆమె తనకు సోదరితో సమానమని అన్నారు. తాను కూడా బెంగాల్ కూతుర్నేనని గుర్తుచేశారు.

## కల్తీ నెయ్యి కేసులో విజయభాస్కర్‌రెడ్డికి చుక్కెదురు

(మొదటి పేజీ తరువాయి)

హైకోర్టు కొట్టివేసింది. ఈ వ్యవహారంలో సమగ్ర దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని కోర్టు పేర్కొంది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది మోహన్ రెడ్డి వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు పూర్తయి ప్రాథమిక చార్జ్ షీట్ దాఖలు చేయడంతో బెయిల్ ఇవ్వాలని మోహన్ రెడ్డి వాదించారు. హవాలా మార్గంలో పిటిషనర్‌కు 75 లక్షల రూపాయలు అందాయని సీబీఐ తరఫు న్యాయవాది సురేష్ కుమార్ కోర్టుకు వివరించారు. కాగా, సికింద్రాబాద్‌కు చెందిన విజయ భాస్కర్‌రెడ్డిని టీటీడీకి కల్తీ నెయ్యి సరఫరా చేసిన కేసులో నిందితుడిగా(ఏ34) చేరుస్తూ గత నవంబరు 23న నెల్లూరు ఏసీబీ కోర్టులో సిట్ మెమో దాఖలు చేసింది. అర్హత లేని డెయిరీలకు సహకరించడం ద్వారా ఆయా సంస్థల నుంచి ఆయన భారీగా లబ్ది పొందారని సిట్ తెలిపింది. ప్రీమియర్ అగ్రి ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ అనే డెయిరీ ఎండీ జగ్‌మోహన్ గుప్తా నుంచి రూ.2.50లక్షలు లంచంగా తీసుకున్నారని వెల్లడించింది. ఆల్ఫా డెయిరీ ప్రతినిధుల నుంచి 8 గ్రా ముల గోల్డ్ కాయిన్.. వైష్ణవి, భోలేబాబా, మాల్‌గంగా, ప్రీమియర్ ఫుడ్స్ తదితర డెయిరీల నుంచి హైదరాబాద్‌లోని హవాలా ఏజంట్ ద్వారా మొత్తం రూ.83 లక్షలు లంచంగా తీసుకున్నారని ఆరోపించింది.

## శాంతియుత వాతావరణమమే శ్రీరామరక్ష

(మొదటి పేజీ తరువాయి)

అయిపోయింది. మావోయిస్టులు తమ ఆయుధాలను పోలీసులకు అప్పగించారు. మొత్తం 124 ఆయుధాలను సరెండర్ చేశారు. లొంగిపోయిన వారిలో దేవ్‌జీ, బడే చొక్కారావు గన్‌మెన్లు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ' మావోయిస్టుల లొంగుబాటుకు అధికారులు తీవ్ర కృషిచేశారు. పోలీసులు మావోయిస్టుల్లో నమ్మకం కల్పించారు. దేవ్‌జీ, ఆయన మిత్రబృందం కొన్ని ప్రతిపాదనలు చేశారు. తమ సమస్యలు పరిష్కరిస్తే లొంగిపోతామని చెప్పారు'. ~రాష్ట్ర స్థాయిలో మేం చేయగలిగిందంతా చేస్తాం. మావోయిస్టు అగ్రనేత గణపతి కూడా లొంగిపోవాలి. అజ్ఞాతంలో ఉన్న తెలంగాణకు చెందిన ఏడుగురు కూడా.. త్వరగా లొంగిపోవాలి. లొంగిపోయిన వారికి పునరావాసం కల్పించాలని అమిత్ షా చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు రివార్డు కూడా అందజేస్తాం. ప్రత్యేకమైన ఆరోగ్య భద్రత కార్డులు ఇస్తాం' అని రేవంత్ రెడ్డి హామీ చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులకు అవసరమైన వసతులు కల్పిస్తాం. మావోయిస్టుల హోదాలను బట్టి ప్యాకేజీ కల్పిస్తాం. ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇల్లు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అని అన్నారు.

## నేడు ఇంద్రకీలాద్రిలో మహాకుంభాభిషేకం

**విజయవాడ,మన జనప్రగతి మార్చి 07:** మహా కుంభాభిషేకం సందర్భంగా విజయవాడ కనకదుర్గమ్మను హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి అచ్చెన్నాయుడు శనివారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన మంత్రులకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు దేవస్థానం అధికారులు. అమ్మవారి దర్శనానంతరం కంచి కామకోటి పీఠాధిపతులను హోం మంత్రి అనిత కలిశారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ.. అమ్మవారిని దర్శించుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. అమ్మవారిని ఎన్నిసార్లు దర్శించుకున్నా తనివి తీరదని తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటలకు మహా కుంభాభిషేకం ప్రారంభమవుతుందని చెప్పారు. ఈరోజు, రేపు అంతరాలయ దర్శనం నిలిపివేస్తారని అన్నారు. ప్రతి 12 ఏళ్లకు వచ్చే ఈ మహా కుంభాభిషేకం మహోత్సవాన్ని వీక్షించేందుకు లక్ష మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నామని తెలిపారు. ఈ మహోత్సవానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేశామని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై మహా కుంభాభిషేక మహోత్సవాలు రెండోరోజుకు చేరుకున్నాయి. రేపు (ఆదివారం) ఉదయం 9:34 గంటలకు ప్రధాన ఘట్టమైన కుంభాభిషేకం జరుగనుంది. మహో త్సవాల్లో భాగంగా కంచి పీఠాధిపతి శంకర జయేంద్ర సరస్వతి కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించారు.

## జగన్ మద్య నిషేధం వెనక అసలు కథ ఇదేనా..?

(మొదటి పేజీ తరువాయి)

రూ.100 కోట్లు కిక్‌బ్యాగ్స్, రూ.3,500 కోట్లు మనీ లాండరింగ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ వెలికి తీసిన రూ.1,048 కోట్ల లావాదేవీల జాడ ఎక్కడ' అని ప్రశ్నించారు. ఒక ఆంగ్ల పత్రికలో వచ్చిన కథనాన్ని తన ట్వీట్‌కు అటాచ్ చేసిన లోకేశ్... '2019 ఎన్నికల్లో జగన్ మీరు ఇచ్చిన మద్య నిషేధం హామీ వెనుక ఇదే నిజమైన స్టోరీనా. మీరు మద్య నిషేధం గురించి ప్రసంగిస్తూ ఉండగానే ఆంధ్రప్రదేశ్‌లో అక్రమ మద్యం వేలాది కుటుంబాలను ఆర్థికంగా, ఆరోగ్యపరంగా నాశనం చేసింది. ఇదే టైంలో మీ అనుచరుల జేబులు వేల కోట్ల రూపాయలతో నిండిపోయాయి. ఏపీ ప్రజలకు మీరు సమాధానం చెబుతారా? లేక మౌనంగా ఉండడమే మంచిదని అనుకుంటున్నారా?' అని ప్రశ్నిస్తూ ట్వీట్ చేశారు.

## తిరుమల లడ్డూపై పదేపదే అవాస్తవాలు

(మొదటి పేజీ తరువాయి)

నెయ్యిని రూ.525కే ఇస్తున్నారు' అని సజ్జల తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థాన లడ్డూలో జంతు కొవ్వు కలవలేదని కేంద్ర దర్యాప్తు బృందం ఇచ్చిన రిపోర్ట్ ఆధారంగా సుప్రీంకోర్టు తెలిపిందని అన్నారు. దేవుడిని రాజకీయాల్లోకి లాగొద్దని చెప్పిన తర్వాత కూడా సీఎం, డిప్యూటీ సీఎం, చివరికి హోం మంత్రి కూడా దిగజారి మాట్లాడుతున్నారని చెప్పారు. వారి తీరును రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. అసెంబ్లీలో కూటమి నేతలు లేనిపోనివన్నీ మాట్లాడుతూ డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారు. కూటమి నేతలు భక్తుల మనోభావాలను దెబ్బతీయవద్దు. లడ్డూ అంశాన్ని డైవర్ట్ చేయడానికి కులాల ప్రస్తావన తీసుకురాకూడదు. రాష్ట్రంలో ఎన్నికలు ఎప్పుడు పెట్టినా కూటమిని ఓడించడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారు. రాజకీయాల్లో ఉన్నారు.. ప్రజలకు మంచి చేయండి.. అని అన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -03-2026

# మహిళలు ఆత్మస్థైర్యంతో అభివృద్ధి చెందాలి

## ● అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు అవగాహన కార్యక్రమం




**పత్తికొండ మన జనప్రగతి మార్చి 07:-** మహిళలు ఆత్మస్తార్యంతో ముందుకు సాగి అభివృద్ధి పథంలో అడుగు వేయాలని పతికొండ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి జోష్ణ దేవి అన్నారు. శనివారం కర్నూలు జిల్లా పత్తికొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జడ్జి ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. దేశం సాంకేతిక పరంగా ఎంతో అభివృద్ధి చెందిందని, మంచి అవకాశాలను మహిళలు అందుచుకుని అభివృద్ధి చెందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిగ్రీ కళాశాల అధ్యాపకులు, న్యాయవాదులు రవి ప్రకాష్, రమేష్ బాబు,వై. శ్రీనివాసరెడ్డి, సూరజ్ నబి, జి.శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేఓఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో మహిళా దినోత్సవ వేడుకలు




**కడప మన జనప్రగతి మార్చి 07:-** కడప నగర పరిధిలోని కందుల ఓబులరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో ఈ రోజు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎంతో ఉత్సాహంగా మరియు ఘనంగా నిర్వహించాము. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీమతి దివ్య, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, మరియు శ్రీమతి శిరీష , అసోసియేట్ కన్సల్టెంట్, టీసీఎస్ హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. వారు మహిళల సాధికారత, నాయకత్వం మరియు వృత్తి అభివృద్ధి గురించి ప్రేరణాత్మక సందేశాలు అందించారు. ఈ కార్యక్రమంలో మా చీఫ్ ప్యాట్రన్ శ్రీమతి లిఖిత కరస్పాండెంట్ , కూడా విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, మహిళలకు విద్య, ఆత్మవిశ్వాసం మరియు వ్యక్తిత్వ వికాసం ఎంత ముఖ్యమో వివరించారు. అదేవిధంగా డా. బి. సిద్ధేశ్వర రావు ,ప్రిన్సిపాల్ మహిళా దినోత్సవం ప్రాముఖ్యతను మరియు వివిధ రంగాలలో మహిళలు సాధించిన గొప్ప విజయాలను గురించి వివరించారు. ఈ వేడుకలలో భాగంగా విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్య ప్రదర్శనలు మరియు ఇతర కార్యకలాపాలలో ఉత్సాహంగా పాల్గొన్నారు. నిర్వహించిన పోటీలలో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కళాశాల వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతంగా నిర్వహించారు.

# బాలికలు కాలంతో పోటీ పడాలి




**కర్నూలు బ్యూరో మన జనప్రగతి 07:-** నేటి సమాజంలో బాలికలు,మహిళలు కాలంతో పోటీ పడి అభివృద్ధి చెందాలని మాజీ మార్కెట్ యార్డ్ చైర్పర్సన్ ఎన్. శమంతకమణి అన్నారు. శనివారం కర్నూలు కింగ్ మార్కెట్ వద్ద ఉన్నప్రభుత్వ బాలి కొన్నత పాఠశాలలో అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమేముఖ్య అతిథి గా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ బాలికలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలి తెలిపారు. 8 తేదీ మహిళల దినోత్సవ సందర్భంగా విద్యార్థులకు బాక్సింగ్ పోటీల్లో పథకాలు సాధించిన క్రీడాకారులకు సన్మానం నిర్వహించారు. మహిళలు అన్నిరంగంలో రాణిస్తున్నారని, గర్వకారణం ఉందని క్రీడల్లో రాణించాలని ఇలాంటి పోటీల్లో పాల్గొన్న వారికి సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం. ఆర్ ఈశ్వరమ్మ భాయ్ వ్యాయమ ఉపాధ్యాయురాలు.జె.వి. పద్మలత డి. సరిత సీనియర్ స్కూల్ అసిస్టెంట్ గోపాల్ సూర్య కుమారి విజయ సుభాషిని శ్రీవిద్య పి. రఫిక్ స్కూలు ఉపాధ్యాయులు సిబ్బంది టైక్వాండో కోచ్ వెంకటేశ్వర్లు,బాక్సింగ్ కోచ్ తేజస్కూల్లో బాక్సింగ్ టైక్వాండో శిక్షణ ఉచితంగా ఇస్తున్నానని తెలియజేయడం జరిగింది సాధించిన పేర్లు అక్షయ 13ఏజి వెయిట్ కేటగిరి 45 పరిమళ 13 ఏజి వెయిట్ కేటగిరి విష్ణు ప్రియ 13ఏజి వెయిట్ కేటగిరి బంగారు సిల్వర్ పథకాలు సాధించారు

# పీఎం సూర్య ఘర్ పథకం లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్



**శింగనమల మన జనప్రగతి మార్చి 07:-**జిల్లాలోని 20 సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను ఏప్రిల్ నెలాఖరులోగా పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం శింగనమల పరిధిలోని పెరవలి గ్రామంలో పీఎం కుసుమ్ (గ్రావీ-ఖఖూఖవీ) పథకం కింద ఏర్పాటు చేస్తున్న 4 మెగావాట్ల సౌర విద్యుత్ ప్రాజెక్ట్ ను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మరియు మెఘా ఇంజినీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులతో సమావేశమై జిల్లా కలెక్టర్ మాట్లాడారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సౌర విద్యుత్ ప్రాజెక్ట్ పనులు వేగంగా చేపట్టాలని, జిల్లాలోని 20 సబ్‌స్టేషన్లలో జరుగుతున్న పనులను త్వరితగతిన పూర్తిచేయాలన్నారు.అనంతరం నాయనపల్లి క్రాస్ వద్ద పీఎం సూర్య ఘర్ పథకం కింద లబ్ధిదారుల ఇళ్లను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ పథకం ద్వారా వినియోగదారులకు మరియు ప్రభుత్వానికి కలిగే ప్రయోజనాల గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలని మరియు మరింత మందిని ఈ పథకానికి ప్రోత్సహించాలని లబ్ధిదారులకు జిల్లా కలెక్టర్ సూచించారుఈ కార్యక్రమంలో ఏపీఎస్పీడిసిఎల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ శేషాద్రి శేఖర్, ఈఈ జె.వి.రమేష్, డీఈ రఘు, మండల మారుతి నాయుడు తదితరులు పాల్గొన్నారు

# మాదక ద్రవ్యాల నియంత్రణే లక్ష్యంగా "ఆపరేషన్ వజ్రప్రహార్"

## ● 350 లీటర్ల నాటుసారా బెల్లం ఊటను, 50 లీటర్ల నాటుసారా ధ్వంసం ● కర్నూలు, బంగారు పేటలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 07:-** మాదకద్రవ్యాలకు, డ్రగ్స్ కి దూరంగా ఉండాలి అనిఅడిషనల్ ఎస్పీ శ్రీ హుస్సేన్ పీరా, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు అన్నారు.రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, ఈగల్ ఐజి ఆకే రవికృష్ణ, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు శనివారం ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమంలో భాగంగా కర్నూలు పట్టణంలోని బంగారు పేటలో కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా ఆధ్వర్యంలో కర్నూల్ సివిల్ పోలీసులు, ఎక్సైజ్ శాఖ, ఈగల్ టీం పోలీసులు కలిసి డ్రోన్ కెమెరా సహాయంతో నిర్వహించారు. ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్ లో 350 లీటర్ల నా బెల్లం ఊటను, 50 లీటర్ల నాటుసారా ను గుర్తించి ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ ఎస్పీ హుస్సేన్ పీరా, జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు మాట్లాడుతూ,డ్రగ్స్ మరియు మాదక ద్రవ్యాలకు ప్రజలు దూరంగా ఉండాలన్నారు. నేర నియంత్రణ తో పాటు డ్రగ్స్ ఫ్రీ స్టేట్ గా మార్చేందుకు ఆపరేషన్ వజ్ర ప్రహార్ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు .యువతను ప్రభావితం చేస్తున్న గంజాయి, డ్రగ్స్, నిషేధిత పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారన్నారు. మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని అవగాహన కల్పిస్తూ "నాశముక్త్ భారత్ అభియాన్" ప్రతిజ్ఞ చేయించారు. అనుమానాస్పద కార్యకలాపాలు గమనించిన వెంటనే డయల్ 112 లేదా డయల్ 100 లేదా ఈగల్ టోల్ ఫ్రీ 1972కు సమాచారం ఇవ్వాలన్నారు. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ఇటువంటి కార్డన్ సెర్చ్ ఆపరేషన్లు కొనసాగుతాయన్నారు.నాటు సారా తయారి పై కేసులు నమోదు చేసి అరెస్టులు చేస్తున్నామన్నారు. ఇంకా కొందరు ఇలాంటి కార్యక్రమాలకు పాల్పడుతున్నారన్నారు . జీవనోపాధి కోసం ప్రభుత్వం పలు అవకాశాలు కల్పింస్తుందన్నారు. ఇప్పటికైనా మారాలన్నారు. కర్నూలు డిఎస్పీ జె. బాబు ప్రసాద్ మాట్లాడుతూనాటుసారా తయారు చేయడం మానుకోవాలన్నారు. పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచించి చదివించుకోవాలన్నారు. మార్పు రాకపోతే వదలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి సుధీర్ బాబు, కర్నూల్ డిఎస్పి బాబు ప్రసాద్ , ఎ ఈ ఎస్ రామకృష్ణా రెడ్డి, కర్నూల్ పట్టణ సిఐలు నాగరాజారావు, శేషయ్య, చంద్రబాబు నాయుడు, తేజ మూర్తి, పార్థసారథి, మన్సురుద్దీన్ , ఎక్సైజ్ సీఐలు చంద్రహాస్, రాజేంద్రప్రసాద్, జయరాం నాయుడు,ఈగల్ టీం ఎస్సై సుజన్ కుమార్, ఎస్ఐలు, సంబంధిత పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లాలో తలసరి ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలి: జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి.







**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 07:-** రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు జిల్లాలో తలసరి ఆదాయాన్ని పెంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ డా.ఏ.సిరి అధికారులను ఆదేశించారు.శనివారం ఉదయం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ లో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు, జిడిడిపి మరియు జిల్లా కీలక పనితీరు సూచికలకు సంబంధించి వ్యవసాయ అనుబంధ శాఖలు, రవాణా, ఐసిడిఎస్, సంక్షేమం, టూరిజం, ఆర్టీసీ, పరిశ్రమలు, ఆర్ డబ్ల్యూఎస్, పంచాయతీ రాజ్, రోడ్లు భవనాలు తదితర శాఖల అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో తలసరి ఆదాయం పెంచే దిశగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ స్పష్టమైన ప్రణాళికలు రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా భౌగోళిక పరిస్థితులకు అనుగుణంగా లక్ష్యాలు కేటాయించుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. జిల్లాలో స్థిరమైన అభివృద్ధి లక్ష్యాలు లలో మంచి పురోగతి ఉన్నప్పటికీ ఇంకా మెరుగుపడాల్సిన అవసరం ఉందన్నారు. సాగునీటి ప్రాజెక్టుల ద్వారా సాగుభూమి విస్తీర్ణాన్ని పెంచి రైతుల ఆదాయాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. అలాగే వ్యవసాయ అనుబంధ శాఖలు, పరిశ్రమలు, టూరిజం తదితర శాఖల ద్వారా తలసరి ఆదాయాన్ని పెంచే విధంగా ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖలోని ముఖ్య అంశాలు, బడ్జెట్ వివరాలు, ఆన్‌లైన్ సేవలు అన్నీ క్లుప్తంగా నివేదిక ను తయారు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. టీనేజీ ప్రెగ్నెన్సీ కి సంబంధించి లక్ష్యాలు సాధించే విధంగా కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలన్నారు.పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ అంశంలో వెనుకబడి ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు.ప్రభుత్వ శాఖలు మంచి సేవలందించాలన్నారు. జిల్లాలో హాస్టళ్ల నిర్వహణ, ఐసిడిఎస్, వైద్య ఆరోగ్య శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి అసంతృప్తిగా ఉన్నారని, ఆయా శాఖల అధికారులు ప్రజలకు మంచి సేవలందించి శాఖల పనితీరును మెరుగుపరచుకోవాలన్నారు. జిల్లాలో టీనేజ్ ప్రెగ్నెన్సీ లను నియంత్రించేందుకు ఐసిడిఎస్ పీడీ మరియు డీఎంహెచ్ఓలు కలిసి ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించాలన్నారు. పబ్లిక్ పర్సెప్షన్‌లో నెగిటివ్ ఫీడ్‌బ్యాక్ వస్తున్న శాఖల అధికారులు క్షేత్ర స్థాయికి వెళ్లి సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హాస్టళ్లను, పాఠశాలల ను ఎంపిడిఓ లు వారానికి ఒక్కసారి తనిఖీ చేసి ఫోటో లను పంపాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.కింది స్థాయి సిబ్బంది క్షేత్ర స్థాయి సందర్శనలకు వెళ్లినపుడు ప్రజలతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించాలని కలెక్టర్ సూచించారు.ప్రజలకు మంచి సేవలందించాలన్నది ప్రభుత్వ ఉద్దేశ్యమని, ఆ దిశగా అన్ని శాఖల అధికారు లు పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. సీపీఓ భారతి, డీఎంహెచ్ఓ డా. భాస్కర్ రాజు, హౌసింగ్ పిడి చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి వరలక్ష్మి, డి ఈ ఓ సుధాకర్, డిపిఓ భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఓరియన్ స్కూల్ క్రీడోత్సవం

## క్రీడోత్సవాలను ప్రారంభించిన ఒలంపిక్ సంఘం నాయకులు రామాంజనేయులు.



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 07:-** కర్నూల్ నగరంలోని గుత్తి పెట్రోల్ బంక్ సర్కిల్లో ఉన్న ఓరియన్ స్కూల్ క్రీడోత్సవాలను జిల్లా ఒలింపిక్ సంఘం నేత బొల్లవరం రామాంజనేయులు లాంచనంగా ప్రారంభించారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.కిండర్ గార్డెన్ నుంచే చిన్నపిల్లలకు ఆట వస్తువులపై, ఆటలపై ఆసక్తి ఉంటుందని, అలాంటప్పుడు శరీర వ్యాయామం పై ఆసక్తిని పెంపొందించుకునేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. అనంతరం విద్యార్థులు క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇందుకోసం విద్యాసంస్థలు విద్యార్థులను క్రీడల వైపు మళ్లించేందుకు కృషి చేస్తున్నడం అభినందనీయమని కొనియాడారు. ఓరియన్ పాఠశాల యజమాన్యం ను ఆయన అభినందించారు. పాఠశాల అంతర్గత క్రీడా పోటీలు అవసరాన్ని ఆయన వివరణాత్మకంగా వివరించారు. విద్యార్థుల ప్రతిభ ఆధారంగా జిల్లా సాయి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసి విద్యతోపాటు క్రీడాకారునిగా గుర్తింపు తీసుకు రావలసిన అవసరం వ్యాయామ ఉపాధ్యాయులపై ఉందన్నారు. అదేవిధంగా పాఠశాల యజమాన్యం విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఎక్కడైతే విద్యా క్రీడలు విలసిల్లుతాయో విద్యార్థులు సర్వతో ముఖాభివృద్ధికి దోహదం చేస్తుందన్నారు. ఒక పాఠశాల విద్యార్థుల లో పోటీలను నిర్వహించి అందులో ప్రతిభ కనబరిచిన వారిని పై స్థాయి పోటీలకు పంపే విధంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. క్రీడలు రెండు రకాలుగా ఉంటాయన్నారు. మేధో శక్తిని పెంపొందించేందుకు క్యారమ్స్ ,చెస్ లాంటి క్రీడలు ఉపకరిస్తాయన్నారు. ఈకార్యక్రమంలో ఓరియన్ పాఠశాల కరస్పాండెంట్ పి.హెచ్.వి.రమణ, ఏవో శ్రీనివాసులు, వైస్ ప్రిన్సిపాల్ మోసేసు ఇమ్మానియేల్, పాఠశాల కోఆర్డినేటర్ రిజ్వాన తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ క్రొత్త ప్రాజెక్టుల లక్ష్యం,వాస్తవ పరిస్థితి

## ఫలితాలు ఇవ్వకపోవడానికి కారణాలు!: కెవిఆర్.విశ్లేషణ!

**ఉరవకొండ మన జనప్రగతి మార్చి 07:-** ప్రాజెక్టుల,లక్ష్యం:-రాయలసీమ వ్యవసాయ ఆధారిత ప్రాంతం.సాగునీటి వనరుల లోపం కారణంగా ఈ ప్రాంతం దీర్ఘకాలంగా వెనకబడి ఉంది. ఈ పరిస్థితిని మార్చాలన్న లక్ష్యంతో 40సంవత్సరముల క్రితం రాయలసీమ వ్యవసాయాభివృద్ధికి కీలకమైన శ్రీశైలం రైట్ బ్రాంచ్ కెనాల్ (ఎస్సార్ బీసీ) తెలుగు గంగ,గాలేరు-నగరి, హంద్రీ-నీవా అనే నాలుగు ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించారు ఈ నాలుగు ప్రాజెక్టుల ద్వారా రాయలసీమలోని నాలుగు ఉమ్మడి జిల్లాలలో సుమారు 14 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు అభివృద్ధితో పాటు,మరో రెండు లక్షల ఎకరాల ఆయకట్టు స్థిరీకరణ అవుతుంది.ఈ ప్రాజెక్టులను ఆరు సంవత్సరాలలో పూర్తి చేయాలన్న స్పష్టమైన లక్ష్యంతో ప్రారంభించారు. అయితే నేటికి 40 సంవత్సరములు గడుస్తున్నా కీలకమైన కొన్ని నిర్మాణాలు మాత్రమే పూర్తి కావడం వల్ల మొత్తం లక్ష్యం 14 లక్షల ఎకరాల ఆయకట్టుకు గాను కేవలం 20 శాతం,అంటే రెండు లక్షల ఎకరాల ఆయకట్టుకు కూడా నీరు అందడం లేదు. రాష్ట్ర విభజన చట్టంలో ఈ ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పూర్తి చేయాలని స్పష్టంగా ఉన్నప్పటికీ,రాష్ట్రం విడిపోయిన తర్వాత గత 12 సంవత్సరాలుగా రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగ లేదన్న కారణాలతో తగినన్ని నిధులు కేటాయించ కపోవడం.



కేంద్రం సహాయ నిరాకరణ. ప్రభుత్వాలు మారినప్పుడల్లా గత ప్రభుత్వం చేపట్టిన పనులను ఆపివేయడం, మార్చి వేయడం.పనులలో జరుగు తున్న అవినీతి. పరిష్కారం:-ఈ ప్రాంత ప్రజలలో రాయలసీమ ప్రాజెక్టుల పై పూర్తి అవగాహన కల్పించి,ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావడానికి ఉద్యమాలకు కార్యోన్ముఖులను చేయాలి. అన్ని ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి,అవసరమైతే ప్రత్యేక రాష్ట్రంగా విడిపోతామని,లేకుంటే ఎన్నికలను బహిష్కరిస్తామనే సహాయ నిరాకరణ ఉద్యమాలను చేపట్టాలి.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -03-2026

## వేడుకగా సూర్య విక్రమాదిత్య - సాక్షిల వివాహమహోత్సవం



**హైదరాబాద్ మన జనప్రగతి మార్చి 07:**–శంషాబాద్ జీఎంఆర్ ఫంక్షన్ హాల్లో రాష్ట్ర డిప్యూటీ సీఎం, రాష్ట్ర ఆర్థిక మంత్రి బట్టి విక్రమార్క కుమారుడు సూర్య విక్రమాదిత్య – సాక్షి ల వివాహ వేడుక అత్యంత వైభవోపేతంగా జరిగింది. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీలు, రాజ్యసభ సభ్యులు, వివిధ పార్టీల నేతలు, శివసేన పార్టీ రాష్ట్ర కోర్ కమిటీ సభ్యుడు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు, సిరిసిల్ల కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ గణేష్ గౌటే తదితరులు పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. సూర్య విక్రమాదిత్య – సాక్షి లకు వివాహమహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.

## జెఎన్‌టీయూఏ పులివెందుల పూర్వ విద్యార్థిని జయశ్రీకి

### - యూపీఎస్సీ మెయిన్స్‌లో 360వ ర్యాంక్



**పులివెందుల మన జనప్రగతి మార్చి 07:**– జెఎన్‌టీయూఏ ఇంజినీరింగ్ కళాశాల, పులివెందుల పూర్వ విద్యార్థిని రాయలం జయశ్రీ (కంప్యూటర్ సైన్స్ బ్రాంచ్ --2019--2023) యూపీఎస్సీ సివిల్ సర్వీసెస్ మెయిన్ పరీక్ష 2025లో 360వ ర్యాంకును సాధించింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. డి. విష్ణు వర్ధన్, వైస్ ప్రిన్సిపాల్ డా. కె. శేష మహేశ్వరమ్మ, బోధన సిబ్బంది, బోధనేతర సిబ్బంది, మరియు విద్యార్థులు రాయలం జయశ్రీని అభినందించారు.

## ఆర్కే వ్యాలీ ట్రిపుల్ ఐటీకి గుర్తింపు తేవాలి

### • డైరెక్టర్ కుమార్ స్వామి గుప్తా



**వేంపల్లె మన జనప్రగతి మార్చి 07:** పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో తమ ప్రతిభను చాటి ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీకి గుర్తింపు తేవాలని ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ కుమార స్వామి గుప్తా తెలిపారు. కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరులో 7,8 తేదిల్లో జరిగే దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎంపిక కావడం జరిగింది. ఈనేపథ్యంలో శనివారం డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పవర్ లిఫ్టింగ్ పోటీలకు వెళ్లే సువర్ణ, సుప్రజ, సాయి హర్షిత, రాఘవేంద్ర, శివ, మెహబూబ్ అనే విద్యార్థులను అభినందించారు. పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి ఉన్నత స్థాయి పోటిలకు ఎంపిక కావాలని కోరారు. క్రీడాలతో కూడ ప్రపంచ స్థాయిలో గుర్తింపు రావడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కూడ వస్తాయాని తెలిపారు. ఉత్తమ ప్రతిభ చూపి ఆర్జీయూకేటీకి మంచి పేరు తేవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పవర్ లిఫ్టింగ్ కోచ్ బాల గోవింద్ తివారీ, అద్యాపకులు ప్రాల్గోన్నారు.

## శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

**శేరిలింగంపల్లి మన జనప్రగతి మార్చి 07:**– శిల్పారామం మాదాపూర్ లో వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా భరతనాట్యం , కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఎంతగానో అలరించాయి. కుమారి శాయశ్రీ పాటిల్ భరత నాట్య ప్రదర్శన లో శాంకరి శాంగురు, కాలాయి తుకి, కల్యాణ రామ భాగ్యదా లక్ష్మి అంశాలను ప్రదర్శించి మెప్పిం చారు. స్వరాంజలి డాన్స్ అకాడమీ నాట్య గురువులు వర్ష రెడ్డి శిష్య బృందం కూచిపూడి నృత్య ప్రదర్శనలో ముద కరత మోదకం, నటేశ కౌతం, భో శంభో, కాళీ కౌతం, అష్టలక్ష్మి , అయిగిరి నందిని , దశావతరం, తక్కువేమి మనకు మొదలైన అంశాలను కళాకారులూ రమ్య, నికిత, శ్రీకరీ, వర్ణిత, శ్రీనిక, సంజన, లసింధూజ,శ్రీనిధిమొదలైనవారు ప్రదర్శించి మెప్పించారు.



## ఘనంగా జాతీయ లైన్‌మెన్ దినోత్సవం

### • ముఖ్యఅతిథిగా ఈఈ ప్రసాద్ రెడ్డి



**పులివెందుల టౌన్ మన జనప్రగతి మార్చి 07:**–ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తుపంపిణీ సంస్థ ఏపీ ఎస్పీడీసీఎల్ జాతీయ లైన్మెన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని స్థానిక కరెంట్ ఆఫీస్ ఆవరణలో ఉన్న విద్యుత్తు ప్రజా కళా వేదిక వద్ద శనివారం జాతీయ లైన్మెన్ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఈ ఈ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి గొప్ప కార్యక్రమాన్ని తమ చేతుల మీదుగా నిర్వహించడం చాలా సంతోషకరమని ముఖ్యంగా ఫీల్డ్ లో లైన్మెన్లు నిరంతరం అహర్నిశలు కష్టపడుతూ 24 గంటలు స్వచ్ఛమైన కరెంటును ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇవ్వడం జరుగుతుందని చాలా సంతోషకరమని ఆలాగే ప్రతి ఒక్క లైన్మెన్ కూడా విధులు నిర్వహించేటప్పుడు కచ్చితంగా సేఫ్టీ పరికరాలు ఉపయోగించుకొని తగు జాగ్రత్తలు తీసుకొని అలాగే ఎల్ సి తీసుకున్నప్పుడు ఒకటికి రెండుసార్లు ఫీడర్ చెక్ చేసుకుని సప్లై ఉన్నదా లేదా అని సమాచారం తెలిసిన తర్వాతే పోల్ ఎక్కి పనిచేయాలని ఈనియమా న్ని కచ్చితంగా ప్రతి ఒక్కరు పాటించవలసినదిగా తెలిపారు. అనంతరం పులివెందుల డివిజన్ సంబంధించి 2026 సంవత్సరం బెస్ట్ లైన్మెన్లుగా ఆనంద్ రెడ్డి, బాబావల్లి, బాల నరసింహులు, వేణుగోపాల్ లకు ప్రసాద్ రెడ్డి చేతులమీదుగా ప్రశంసా పత్రాన్ని ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏడీఈ గురు మోహన్ రెడ్డి, ఏడి సుధాకర్ రెడ్డి, ఏఈలు రమేష్ రెడ్డి, రమేష్ , వేణుగోపాల్, సబ్ ఇంజనీర్లు, లైనింగ్, ఇన్స్పెక్టర్లు ,లైన్మెన్లు, ఏఎల్ఎం, జేఎల్ఎం లో, ఈఆర్ఓ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ పరీక్ష కేంద్రాల వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు



**కడప టౌన్ మన జనప్రగతి మార్చి 07:**–జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు..జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షల నేపథ్యంలో ఆయా పరీక్షా కేంద్రాల వద్ద పోలీస్ అధికారులు పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున పరీక్షా కేంద్రాలు ఆవరణలో బయట వ్యక్తులు లేకుండా చర్యలు తీసుకున్నారు. పరీక్షా కేంద్రాల సమీపంలోని అన్ని జిరాక్స్ సెంటర్లను మూసివేయించేలా చర్యలు తీసుకున్నారు. జిల్లాలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల సెంటర్ల వద్ద సిఐ లు, ఎస్ఐలతో పాటు, పోలీస్ సిబ్బందిని నియమించి పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. సెంటర్ల వద్ద మొబైల్ ఫోన్లు ,ఎలక్ట్రానిక్ పరికరాలు, తీసుకురాకుండా కట్టుదిట్టమైన తనిఖీలు నిర్వహించారు . అలాగే ప్రశ్నపత్రాల రవాణా భద్రతా పరంగా ప్రత్యేక ఎస్కార్ట్ ఏర్పాటు చేశారు. సెంటర్ల పరిసర ప్రాంతాలలో అనుమానస్పద వ్యక్తులపై నిఘా ఏర్పాటు చేసి ఎలాంటి ఘటనలు జరగకుండా తగు చర్యలు తీసుకున్నారు. పరీక్షల నిర్వహణలో ఎలాంటి లోపాలు ,సంఘటనలు తలెత్తకుండా పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. విద్యార్థిని, విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలని జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ సూచించారు.

## శ్రీ దండూవారమ్మ తల్లి జాతరలో పూజలు నిర్వహించి అన్నదానాన్ని ప్రారంభించిన సుగవాసి ప్రసాద్ బాబు



**రాయచోటి మన జనప్రగతి మార్చి 07:**–రాయచోటి పట్టణం పాత రాయచోటిలో వెలసిన శ్రీ దండూవారమ్మ తల్లి జాతర మహోత్సవం శనివారం కన్నుల పండుగగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు రాజంపేట పార్లమెంట్ టీడీపి అధ్యక్షులు, టీటీడీ పాలక మండలి మాజీ సభ్యులు సుగవాసి ప్రసాద్ బాబు ఈ వేడుకల్లో పాల్గొన్నారుముందుగా ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల కోసం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రసాద్ బాబు ని ఆలయ కమిటీ సభ్యులు శాలువా కప్పి, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండ్ల సతీష్, ఉమ్మరశెట్టి సుబ్బరాయుడు, భక్తా సార్, సూరి, నాగేంద్ర, సుబ్బారాయుడు, సతీష్, మహేష్,బాలాజి,నరేష్, మధు, మల్లికార్జున, సాయి ప్రతాప్, రాహుల్, అభి, శివ, సుగవాసి శ్రీనివాసులు,మన్నేరు రామాంజనేయులు, బడిశెట్టి రవి, వాకా వాసు, ప్రవీణ్ రాజు, మనోహర్, నాగచైతన్య,మరియు ఇతర ముఖ్య నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన జయచంద్రా రెడ్డిని పరామర్శించిన శ్రీకాంత్ రెడ్డి



**రాయచోటి మన జనప్రగతి మార్చి 07:**–చిన్నమండెం మండల మానవత సంస్థ శాఖ చైర్మన్ జయచంద్రా రెడ్డి ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి కడపలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ సందర్భంగా శనివారం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి ఆసుపత్రికి వెళ్లి జయచంద్రా రెడ్డిని పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి త్వరగా కోలుకోవాలని శ్రీకాంత్ రెడ్డి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్ఆర్ సీపీ నాయకులు బాబు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు కౌన్సిలింగ్



**చెన్నూరు మన జనప్రగతి మార్చి 07:** – జిల్లా ఎస్.పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఆదేశాల మేరకు కడప డి.ఎస్పీ ఎ. వెంకటేశ్వర్లు పర్యవేక్షణ లో శనివారం తెల్లవారుఝామున కడప సబ్ డివిజన్ పరిధిలోని చెన్నూరు పోలీస్ స్టేషన్ల పరిధిలో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. చెన్నూరు పోలీస్ స్టేషన్ పరిధిలోని శాటిలైట్ సిటీ లో 'ఆపరేషన్ వజ్ర ప్రహార్'లో భాగంగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. పాత నేరస్తులు మరియు అనుమానితుల ఇళ్లలో, అనుమానిత ప్రాంతాల్లో వేటకొడవళ్లు, బాంబులు మరియు నిషేధిత ఆయుధాల కొరకు అణువణువూ క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. వాహనాల రికార్డులను పరిశీలించారు. రికార్డులు లేని 5 ద్విచక్ర వాహనాలను తనిఖీల్లో స్వాధీనం చేసుకున్నారు. రౌడీ షీటర్లు, ట్రబుల్ మాంగర్లకు, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. గ్రామస్థులు ఎవరూ ఎలాంటి గొడవలకు పాల్పడకుండా మీరు మీ పనులు చేసుకుంటూ ఆర్థికంగా ఎదిగి పిల్లల బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సూచించారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి లేదా అనుమానితుల సమాచారాన్ని డయల్ 112 ద్వారా పోలీస్ శాఖకు సమాచారమివ్వాలని సూచించారు. కార్డన్ అండ్ సర్చ్ తనిఖీల్లో చెన్నూరు సి. ఐ. కృష్ణారెడ్డి, పెండ్లిమర్రి సి.ఐ చల్లని దొర, కమలాపురం సి.ఐ మోహన్, కడప తాలూకా సి. ఐ రెడ్డెప్ప, కడప 2 టౌన్ సి. ఐ ప్రసాద్ రావు, ఎస్.ఐ లు శ్రీనివాసుల రెడ్డి, శివనాగిరెడ్డి, విద్యాసాగర్, రఫీ, రామకృష్ణ, ప్రతాప్ రెడ్డి,, చద్ర శేఖర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

## 16న పొట్టి శ్రీరాముల విగ్రహావిష్కరణ

### • 58 అడుగుల ఎత్తులో అమరజీవి కాంస్య విగ్రహం • సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ఆవిష్కరణ • అమరజీవి స్మృతి వనం పరిశీలించిన మంత్రి సవిత





**అమరావతి మన జనప్రగతి మార్చి 07:**– అమరజీవి పొట్టి శ్రీరాముల ప్రాణ త్యాగ ఫలితం భావితరాలకు తెలియజేయాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. పొట్టి శ్రీరాముల 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రాజధాని అమరావతిలోని తుళ్లూరులో ఏర్పాటు చేస్తున్న అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో ఏర్పాటు చేస్తున్న ఆయన విగ్రహ పనులను శనివారం మంత్రి సవిత పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె తనను కలిసిన విలేకరులతో మాట్లాడారు. రాజధాని అమరావతిలో 6.8 ఎకరాల్లో స్టాట్యూ ఆఫ్ శాక్రిఫైస్ పేరుతో అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. స్మృతి వనంలో ఆయన కాంస్య విగ్రహాన్ని అమరజీవి చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేస్తోందన్నారు. అమరజీవి 58 రోజుల అమరణ దీక్షకు గుర్తుగా 58 అడుగుల ఎత్తైన ఆయన కాంస్య విగ్రహం ఏర్పాటు చేస్తున్నారన్నారు. ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన పొట్టి శ్రీరాములు ఆశయాలను, త్యాగాన్ని భవిష్యత్ తరాలకు అందించడమే స్మృతి వనం లక్ష్యమన్నారు. ఈ నెల 16న అమరజీవి 125వ జయంతి సందర్భంగా సీఎం చంద్రబాబు చేతుల మీదుగా పొట్టి శ్రీరాముల కాంస్య విగ్రహావిష్కరణను చేయబోతున్నామన్నారు. ఈ కార్యక్రమానికి ఆయనతో పాటు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్, పలువురు మంత్రులు తరలిరానున్నారన్నారు. ఆర్యవైశ్యుల సంక్షేమానికి సీఎం చంద్రబాబు కట్టుబడి ఉన్నారన్నారు. ఎన్నికల్లో హామీ ఇచ్చిన విధంగా శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి ఆత్మార్పణ చేసిన రోజును రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నామన్నారు. వాసవీ మాత పేరుతో ఆమె జన్మించిన పెనుగొండ గ్రామాన్ని వాసవీ పెనుగొండగా మార్చామని మంత్రి సవిత తెలిపారు. అంతకుముందు ఆమె, అమరజీవి పొట్టి శ్రీరాములు స్మృతి వనంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. వీలైనంత త్వరగా పొట్టి శ్రీరాముల విగ్రహ ఏర్పాటు పనులు పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ డూండీ రాకేశ్, ఇతర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టెన్త్ విద్యార్థులకు ప్రోత్సాహకం... విద్యా సామగ్రి పంపిణీ

**కలికిరి మన జనప్రగతి మార్చి 07:**– కలికిరి మండలంలోని ఇందిరమ్మకాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు ప్రోత్సాహం అందిస్తూ విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. టిడిపి పీలేరు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కె.అగస్తీశ్వర్ మరియు ఆయన సతీమణి కె. మంగమ్మ దంపతులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. గతంలో ఇదే పాఠశాలలో తెలుగు అధ్యాపకురాలిగా సేవలందించిన కె. మంగమ్మ ప్రస్తుతం వాల్మీకిపురం పీసీసీ హైస్కూల్‌లో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహిస్తున్నారు. పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు ఉత్సాహం కలిగించేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. సుమారు రూ.7,000 విలువైన ప్యాడ్లు, జ్యామెట్రీ బాక్సులు, పెన్నులు వంటి విద్యా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. పరీక్షలకు వెళ్లే సమయంలో అవసరమైన వస్తువులు కొత్తగా ఉండటం వల్ల విద్యార్థుల్లో ఉత్సాహం పెరుగుతుందని భావించి ఈ ప్రోత్సాహకాన్ని అందిస్తున్నట్లు దంపతులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులందరూ కష్టపడి చదివి పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. హైస్కూల్ అనంతరం ఉన్నత విద్యను అభ్యసించే దశలో ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన విద్యను పొందాలని సూచించారు. గురువులను గౌరవించడం, సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తించడం ప్రతి విద్యార్థి లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ప్రోత్సాహకానికి ఆనందం వ్యక్తం చేస్తూ దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ రెడ్డి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.



## పులివెందులలో ఘనంగా జాతీయ లైన్ మెన్ దినోత్సవం

● ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఈఈ ప్రసాద్ రెడ్డి

● ఉత్తమ లైన్ మెన్లకు ప్రశంసా పత్రాల అందజేత




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:–**ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్తు పంపిణీ సంస్థ (ఏపీఎస్పీడీసీఎల్) ఆధ్వర్యంలో శనివారం జాతీయ లైన్ మెన్ దినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. పులివెందుల పట్టణంలోని స్థానిక విద్యుత్ కార్యాలయ ఆవరణలో ఉన్న 'విద్యుత్ ప్రజా కళా వేదిక' వద్ద జరిగిన ఈ వేడుకకు డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (ఆపరేషన్) ప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు 24 గంటల పాటు అంతరాయం లేని విద్యుత్ అందించడంలో లైన్ మెన్లు అహర్నిశలు కష్టపడుతున్నారని కొనియాడారు. క్షేత్రస్థాయిలో వారు ప్రాణాలకు తెగించి చేసే సేవలు ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో లైన్ మెన్లు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు సూచనలు చేశారు. ప్రతి ఒక్కరూ ఖచ్చితంగా సేఫ్టీ బెల్టులు, గ్లౌజులు వంటి భద్రతా పరికరాలను ధరించాలని, లైన్ క్లియరెన్స్ తీసుకున్నప్పుడు ఒకటికి రెండుసార్లు ఫీడర్లను చెక్ చేసుకోవాలన్నారు. సప్లై ఆగిందని పూర్తి సమాచారం తెలిసిన తర్వాతే పోల్ ఎక్కి పని చేయాలని హెచ్చరించారు. పులివెందుల డివిజన్ పరిధిలో 2026 సంవత్సరానికి గాను అత్యుత్తమ సేవలు అందించిన నలుగురు లైన్ మెన్లు ఆనంద్ రెడ్డి, బాబావల్లి, బాల నరసింహులు, వేణుగోపాల్ లను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించారు. వీరికి ఈఈ ప్రసాద్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏడీఈ (టౌన్) గురు మోహన్ రెడ్డి, ఏడీ సుధాకర్ రెడ్డి, ఏఈలు (టౌన్) రమేష్ రెడ్డి, రమేష్, వేణుగోపాల్‌తో పాటు సబ్ ఇంజనీర్లు, లైనింగ్ ఇన్‌స్పెక్టర్లు, లైన్ మెన్లు, ఏఎల్ఎం, జేఎల్ఎంలు మరియు ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## శిల్పారామంలో పీఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్"ను ప్రారంభించిన ఎం.ఎస్.ఎం.ఈ అధికారులు




**మాదాపూర్ మన జన ప్రగతి మార్చి 07:–**ఎంఎస్ఎంఈ అభివృద్ధి మరియు సౌకర్యాల కార్యాల యం " ఎం ఎస్ ఎం ఈ – డి ఎఫ్ ఓ' హైదరాబాద్, భారత ప్రభుత్వ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీఎం విశ్వకర్మ కళాకారుల ప్రయోజనార్థం మూడు రోజుల పీఎం విశ్వకర్మ ట్రేడ్ ఫెయిర్ ను మార్చి 6 నుండి 8, 2026 వరకు హైదరాబాద్‌లోని శిల్పరామం ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ విలేజ్, మాధాపూర్ లో నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులు: సి. ఎస్. ఎస్. రావు సంయుక్త సంచాలకులు, ఎంఎస్ఎంఈ సతీష్ రెడ్డి, ఆర్‌డీఎస్‌డీఈ సురేష్ బాబు సంయుక్త సంచాలకులు, ఎన్ఎస్ఐసీ ఎస్. వి. దశరథ్ కార్యక్రమ సమన్వయకర్త ప్రముఖులు సంప్రదాయబద్ధంగా దీపం వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎం ఎస్ ఎం ఈ – డీఎఫ్ఓ హైదరాబాద్ సంయుక్త సంచాలకుడు సి. ఎస్. ఎస్. రావు, రీజినల్ డైరెక్టరేట్ ఆఫ్ స్కిల్ డెవలప్మెంట్ అండ్ ఎంట్రప్రెన్యూర్షిప్ శిక్షణ అధికారి సతీష్ రెడ్డి, అలాగే ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పీఎం విశ్వకర్మ కళాకారులు మరియు పాల్గొనేవారు కూడా పాల్గొన్నారు. ప్రదర్శనను ప్రముఖులు అధికారికంగా ప్రారంభించారు. ఈ ట్రేడ్ ఫెయిర్‌లో మొత్తం 50 స్టాళ్లు ఏర్పాటు చేశారు. వీటిలో వడ్రంగి పని కార్పెంట్రీ , బంగారు పనితనం గోల్డ్‌స్మిత్ , కుండల తయారీ బుట్టల నేసడం , దర్జీ పని బొమ్మలు మరియు ఆట వస్తువుల తయారీ, పూలమాలల తయారీ వంటి సంప్రదాయ వృత్తులకు చెందిన పీఎం విశ్వకర్మ కళాకారులు తమ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఈ ప్రదర్శన ద్వారా కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా వినియోగదారులకు చూపించి విక్రయించే అవకాశం పొందారు. ఈ కార్యక్రమాన్ని ఎం ఎస్ ఎం ఈ– డీఎఫ్ఓ హైదరాబాద్ సహాయ సంచాలకుడు ఎస్. వి. దశరథ్ సమన్వయం చేశారు.

## చందానగర్ డివిజన్లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

### ముఖ్యఅతిథిగా పాల్గొన్న బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**శేరిలింగంపల్లి మన జనప్రగతి మార్చి 07:–** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ డివిజన్‌లో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ నవతా రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ సందర్భంగా శేరిలింగంపల్లి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మారబోయిన రవి యాదవ్ కార్యక్రమంలో పాల్గొన్నారు. సమాజ సేవకులు, కళాకారులు, పాత్రికేయులు, పారిశుద్ధ్య కార్మికులు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ రంగాల్లో విశేష సేవలు అందించిన అనేక మంది మహిళలను ఈ సందర్భంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి, శాసన సభ్యురాలు సబితా ఇంద్ర రెడ్డి, సునీత లక్ష్మణ్ రెడ్డి, కూకట్‌పల్లి శాసన సభ్యులు మాధవరం కృష్ణారావు, సింధు ఆదర్శన్ రెడ్డి, గచ్చిబౌలి మాజీ కార్పొరేటర్ కొమిరిశెట్టి సాయిబాబా, మాధవరం రంగారావు, ఆదర్శ్ రెడ్డి, రోజా, ఎరబల్లి సతీష్ రావు, శ్రీకాంత్, శ్రీనివాస్ గౌడ్, గోపరాజు శ్రీనివాస్, కిరణ్, రవీందర్ యాదవ్, వల్ల హరీశ్ రావు, అలాద్దీన్ పటేల్, సంతోష్, నరేందర్, కె.ఎన్. రాములు, మజీత్, ముజీబ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రాంతానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై మహిళా దినోత్సవ వేడుకలను ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు.



## అంకాలమ్మ దేవస్థానంలో ముగిసిన టెంకాయల వేలం

● రూ.11.65 లక్షలకు దక్కించుకున్న కర్ణకంటి శ్రీనివాసులు



**సింహాద్రిపురం మన జనప్రగతి మార్చి 07:–** సింహాద్రిపురం మండలం అంకాలమ్మగూడూరు లోని శ్రీ శ్రీ శ్రీ అంకాలమ్మ దేవస్థానంలో టెంకాయల విక్రయానికి సంబంధించి నిర్వహించిన బహిరంగ వేలం పాట శనివారం సజావుగా ముగిసింది. అంకాలమ్మ గూడూరులోని ఆలయ కళ్యాణ మండపంలో ఉదయం 8:00 గంటల నుంచి ప్రారంభమైన ఈ వేలం ప్రక్రియలో భక్తులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ వేలంలో కర్ణకంటి శ్రీనివాసులు అత్యధికంగా రూ. 11,65,000/– (పదకొండు లక్షల అరవై ఐదు వేల రూపాయలు) పాడి టెంకాయల విక్రయ హక్కులను దక్కించు ఉన్నట్లు ఆలయ నిర్వహకులు తెలియజేశారు. ప్రస్తుతం కొనసాగుతున్న పాత కాంట్రాక్ట్ గడువు మార్చి 10, 2026తో ముగయనున్న నేపథ్యంలో కొత్తగా వేలం దక్కించుకున్న శ్రీనివాసులు మార్చి 11, 2026 నుండి మార్చి 10, 2027 వరకు ఏడాది పాటు దేవస్థానంలో టెంకాయల విక్రయాలు నిర్వహించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమం ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఇంచార్జ్ ఎస్.ఐ. ఘన మద్దిలేటి పర్యవేక్షణలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు మరియు గ్రామస్థులు పాల్గొన్నారు. వేలం అనంతరం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు.

## మహిళ అభివృద్ధికి స్త్రీ శారీరక మానసిక దృఢత్వంమే ప్రధానం

● రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం.



**కడప మన జనప్రగతి మార్చి 07:–** అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా కడుప నగరం ఐఎంఏ హాల్ నందు బిజెపి కడప జిల్లా మోర్చా మహిళా అధ్యక్షురాలు ఎన్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర శాసనమండలి డిప్యూటీ చైర్మన్ జాకియా ఖానం హాజరై మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలుపుతూ ప్రపంచంలో మానవ అభివృద్ధి చెందాలంటే ప్రధానంగా మహిళ మానసికంగా దృఢంగా ఉన్నప్పుడే మానవ అభివృద్ధి చెందుతుందని తెలిపారు. శనివారం మీ సందర్భంగా బిజెపి జిల్లా మోర్చా మహిళా అధ్యక్షురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రపంచంలోని మహిళలందరూ మానసికంగా శారీరకంగా దృఢంగా ఉన్నప్పుడే కుటుంబంగానీ, పుట్టే బిడ్డలు కానీ ఆరోగ్యంగా సంతోషంగా ఉండగలరని వారు తెలిపారు. ఎక్కడ స్త్రీలు పూజింపబడుతారో అక్కడ దేవతలు ఉంటారని మన పురాణాల్లో ఉందన్నారు. భారతీయ సమాజంలో స్త్రీకి ప్రధాన పాత్ర ఉందని కుటుంబ పోషణ కొరకు అనేక విలువలను తల్లి నేర్పిస్తుందని, ఒక స్త్రీని పెళ్లి చేసుకోవాలంటే అటూ ఏడు తరాలు ఇటు ఏడు తరాలు పరిశీలన చేసి మంచి చెడులు అలోచించి మంచి సంబంధాలను కుదురుస్తారని దానికి గల ప్రధాన కారణం పుట్టబోయే బిడ్డలు హార్మోన్ పరంగా, డీఎన్ఏ పరంగా ఆరోగ్యంగా ఉండడానికి చేసే గొప్ప కార్యమని తెలిపారు. ప్రస్తుత ప్రపంచంలో స్త్రీ ఇంటి నుంచి బయటకు రావాలంటే అనేక ఆటంకాలు ఎదురవుతున్నాయని వాటిని ఎదుర్కోవడానికి శారీరకంగా మానసికంగా దృఢంగా ఉండాలని ఆత్మహత్యలు సరైన పరిష్కారం కాదని తెలిపారు. స్త్రీలకు సర్వైవల్ క్యాన్సర్ రాకుండా ప్రధాని నరేంద్ర మోడీ 14 సంవత్సరాలు దాటిన స్త్రీలందరికి టీకాలను వేపిస్తున్నారు. స్త్రీలకు అవసరమైన పోషకాలు ప్రభుత్వ అందించాలని తెలిపారు. ప్రపంచంలో జరుగుతున్న మహిళలపై రేపులు, హత్యలు, వ్యభిచారాలు మానవ అక్రమ రవాణాలు మొదలగు వాటి పైన ప్రభుత్వాలు కఠినంగా శిక్షించాలని వాటికోసం బలమైన చట్టాలు తేవాలని మహిళలకు 33శాతం రిజర్వేషన్లు ప్రతి రాష్ట్రంలో కల్పించాలని స్త్రీలకు స్వేచ్ఛ స్వాతంత్రం లభించినప్పుడే మానవ మనుగడ అనేది సుఖశాంతులతో ఉంటుందని స్త్రీలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉందని వారు తెలిపారు. రాష్ట్ర నాయకుడు శశిభూషణ్ రెడ్డి, చేకూరి శారద. సుష్మ, జయలక్ష్మి, షకీలా బేగం , డాక్టర్లు కళ్యాణి ,రవికుమార్, బిజెపి నాయకులు, నాయకురాలు తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన







**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:–**పులివెందుల పట్టణ పరిధిలోని శరణ్య హాస్పిటల్ నందు కిమ్స్ సవేరా వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించిందని డాక్టర్ నవీన్ శరణ్యాలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శరణ్య హాస్పిటల్ యాజమాన్యం డాక్టర్ నవీన్ శరణ్య లు పత్రికాముఖంగా తెలియజేస్తూ మార్చ్ 7 వ తారీఖు కిమ్స్ సవేరా అనంతపురం వారి ఆధ్వర్యంలో శరణ్య హాస్పిటల్ నందు జరిగిన ఉచిత కాన్సర్ వైద్య శిబిరం లో ఒక్కొకటి 3000 రూపాయలు విలువ గల 170 పాప్ స్మెయర్ (గర్భసంచి కాన్సర్ ) మరియు ఒక్కొక్కటి 3500 రూపాయలు విలువ గల 170 మమ్మోగ్రఫీ (రొమ్ము కాన్సర్ ) పరీక్షలు మరియు 200 పైగా అల్ట్రాసౌండ్ మరియు చెస్ట్ ఎక్రే పరీక్షలు మరియు రక్త పరీక్షలు పూర్తిగా ఉచితం గా చేయడం జరిగింది. వారి అందరి రిపోర్ట్స్ పరిశీలించి తగిన సూచనలు సలహాలు ఇవ్వడం జరిగింది. పేద ప్రజలకు సేవలు అందించాలన్న సంకల్పంతో ఇటువంటి క్యాంపు మునుపెన్నడు పులివెందుల లో జరగలేదని. ప్రజలు ఈ అవకాశం వినియోగించు కున్నందుకు సంతోషం గా ఉందని తెలిపారు. రానున్న కాలంలో ఇంకా ఇటువంటి క్యాంప్స్ ఇంకా జరిపించుటకు ప్రయత్నం చేస్తామని తెలిపారు. శరణ్య హాస్పిటల్ సిబ్బంది సవేరా హాస్పిటల్స్ సిబ్బంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## పులివెందుల ఏపీ-జేఏసీ కో-కన్వీనర్‌గా రామాంజనేయులు ఎన్నిక




**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:–**ఇటీవల పులివెందులలో జరిగిన ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సంఘం ఏ పి – జె ఏ సి సమావేశంలో పులివెందుల తాలూకా కో కన్వీనర్ గా యుటిఎఫ్ నాయకుడు కాయపాటి రామాంజనేయులు ని ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా కాయపాటి రామాంజనేయులు మాట్లాడుతూ గత కొద్ది కాలంగా యుటిఎఫ్ సంఘంలో పులివెందుల ప్రాంతీయ కన్వీనర్ గా ఉంటూ చేసిన పలు సేవా కార్యక్రమాలు మరియు ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పట్ల నా ఉద్యమ పోరాట స్ఫూర్తిని గుర్తించి నన్ను ఏపి – జెఏసి పులివెందుల తాలూకా కో కన్వీనర్ గా ఎన్నుకోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఇది నాకు ఏపీ యుటిఎఫ్ అదేవిధంగా ఏపి – జెఏసి పట్ల ఉన్న గౌరవాన్ని పెంచుతూ ఉద్యోగ ఉపాధ్యాయ కార్మిక పెన్షనర్ల సమస్యల పట్ల పోరాడే బాధ్యతను మరింత పెంచిందని తెలుపుతూ తనను కో కన్వీనర్ గా ఎన్నుకున్న ఏపిజెఏసి పులివెందుల తాలూకా చైర్మన్ జగన్నాథ రెడ్డి కి శాలువా, పూలదండతో కృతజ్ఞతలు తెలియజేశారు. పులివెందుల ప్రాంత యూటీఎఫ్ నాయకులు రమేష్ బాబు, శ్రీనివాసరెడ్డి, వెంకటకృష్ణ, కంబటి రవీంద్ర, ఎఱ్ర గొర్ల ఆంజనేయులు, గంగాధర మరియు ఇతర కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు అభివృద్ధి చెందాలి




**ఆదోని మన జనప్రగతి మార్చి 07:–** గ్రామీణ ప్రాంతాల్లో ఉండే మహిళలు పల్లెలకే పరిమితం కాకుండా అభివృద్ధి చెంది మంచి అవకాశాలు అందిపుచ్చుకొని ఉన్నతమైన రంగాల్లోకి ముందుకు సాగాలని ఆదోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు జడ్జి యజ్ఞ నారాయణ అన్నారు. శనివారం కర్నూలు జిల్లా ఆదోని మండలం చాగి గ్రామంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మహిళా చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నేటి పోటీ ప్రపంచంలో గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు తమ ఆడపిల్లలను బాగా చదివించి వారిని వృద్ధిలోకి తీసుకురావాలని కోరారు. అలాగే మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాది లోకేష్ కుమార్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ప్రేమాలయం ఆశ్రమానికి కుర్చీల పంపిణీ

**రాయచోటి మన జనప్రగతి మార్చి 07:–** రాయచోటి పట్టణంలోని బండపల్లి ప్రేమలయం ఆశ్రమం నందు లక్కిరెడ్డిపల్లి వాస్తవ్యులుముద్దిశెట్టి ప్రసాద్ వారి సతీమణి ముద్దిశెట్టి రత్న కుమారి గార్ల ఆర్థిక సహాయంతో వృద్ధుల కోసం 7 కుర్చీలను ఆశ్రమం నిర్వాహకులు సుబ్బయ్య గారికి అందజేయడం జరిగిందని సమాజ సేవకులు చాన్ బాషా మాట్లాడుతూ ఆశ్రమం నిర్వాహకులు సుబ్బయ్య గారు వృద్ధుల కోసం కుర్చీల కొరత ఉందని దాతల సహాయంతో అందజేయాలనీ తెలుపగా ముద్దిశెట్టి ప్రసాద్ గారి పుట్టిన సందర్భంగా పంపిణీ చెయ్యడం జరిగిందని ప్రతీ ఒక్కరు ప్రజలకు ఉపయోగపడే సేవ కార్యక్రమాలు నిర్వహించి ప్రజా సేవలో ఉండాలని తెలిపారు అనంతరం దాత ముద్దిశెట్టి ప్రసాద్ మాట్లాడుతూ నా పుట్టిన పురస్కరించుకొని ఇక్కడ ఉన్న పెద్దలకు కుర్చీలను అందజేయడం సంతోషంగా ఉందని భవిష్యత్ లో కూడా సేవ కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు అనంతరం ఆశ్రమం నిర్వాహకులు సుబ్బయ్య మాట్లాడుతూ మా ఆశ్రమములో వృద్ధుల కోసం కుర్చీలను అడిగిన వెంటనే ఇచ్చిన దాతలకు మా ఆశ్రమం మేనేజ్మెంట్ తరపున ధన్యవాదాలు తెలుపుకుంటున్నామని తెలిపారు ఈ కార్యక్రమములో దాత కుటుంబ సభ్యులు ఆశ్రమం సిబ్బంది పాల్గొన్నారు.



# గ్యాస్ వినియోగదారులపై అదనపు భారం

## ● గృహ అవసరాలు 50, కమర్షియల్ సిలిండర్ పై115 పెంపు



**కర్నూలు బ్యూరో మన జనప్రగతి మార్చి 07:-** గ్యాస్ వినియోగదారులపై నేటి నుండి అదనపు భారం పడనుంది.. ప్రస్తుతం ఉన్న సిలిండర్ ధరలకు గృహ అవసరాలకు వాడే సిలిండర్ పై 50, కమర్షియల్ సిలిండర్ లపై 115 రూపాయలు ధరలు పెంచినట్లు జిల్లా పౌరసరఫరాల అధికారి రఘువీర్ ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఆయన ఈ సందర్భంగా పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్పీజీ డీలర్ల వద్ద గ్యాస్ నిల్వలు ఉన్నందున వినియోగదారులు ఆందోళనకు గురై ఎక్కువగా బుకింగ్ చేసుకోవడం జరుగుతుందని, అలా చేయవద్దని తెలియజేశారు. అలాగే గ్యాస్ వినియోగదారులు తమ సిలిండర్లను హోటళ్లకు అందజేస్తే అలాంటి వారి సబ్సిడీని, వారి కనెక్షన్ రద్దుచేసి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. డిస్ట్రిబ్యూటర్లు సైతం గృహ అవసరాల సిలిండర్ లను వాణిజ్య వ్యాపారులకు అందజేస్తే వారి లైసెన్సును రద్దు చేస్తామని హెచ్చరించారు. ఎవరైనా ఇలా అక్రమాలకు పాల్పడుతుంటే 1967 టోల్ ఫ్రీ నెంబర్ కు సమాచారం అందించాలని, అలాగే తాసిల్దార్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని కోరారు.

# 'ఆపరేషన్ వజ్రప్రహార్': డ్రోన్ల నిఘాలో తనిఖీలు



**రాయచోటి మన జనప్రగతి మార్చి 07:-**అన్నమయ్య జిల్లా ఎస్పీ ధీరజ్ ఆదేశాల మేరకు రాయచోటి, మదనపల్లె (అంగళ్ళు) ప్రాంతాల్లో శనివారం తెల్లవారుజామున పోలీసులు భారీ 'కార్డన్ & సెర్చ్' నిర్వహించారు. మత్తు పదార్థాల రహిత జిల్లానే ధ్యేయంగా 'ఆపరేషన్ వజ్రప్రహార్' పేరుతో 10 ప్రత్యేక బృందాలు మెరుపు దాడులు చేశాయి. అధునాతన డ్రోన్ కెమెరాల సహాయంతో సమస్యాత్మక ప్రాంతాలు, ఖాళీ భవనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.రాయచోటిలో డీఎస్పీ కృష్ణమోహన్, మదనపల్లె రూరల్‌లో సీఐ రవి నాయక్ నేతృత్వంలో సోదాలు జరిగాయి. సరైన పత్రాలు లేని పలు వాహనాలను సీజ్ చేశారు. గంజాయి, డ్రగ్స్, కూల్-లిప్స్ వంటి వ్యసనాలకు యువత దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ప్రజలతో 'నాశముక్త్ భారత్' ప్రతిజ్ఞ చేయించి, అసాంఘిక కార్యకలాపాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. అత్యవసర సహాయం కోసం 112, మత్తు పదార్థాల సమాచారం కోసం 1972 నంబర్లను సంప్రదించాలని తెలిపారు .

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ ఆధ్వర్యంలో క్రీడా దుస్తుల పంపిణీ



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మార్చి 07:-**లక్కిరెడ్డిపల్లి మండలం దేవలంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నిమ్మలపల్లి మండలం బి రెడ్డమ్మ ఆర్థిక సహకారంతో క్రీడా దుస్తులు పంపిణీ చేయడం జరిగిందని లయన్స్ క్లబ్ రాయచోటి టౌన్ అధ్యక్షులు లయన్ శ్యామ్ తెలియజేశారు. అనంతరం దాత బి రెడ్డమ్మ మాట్లాడుతూ దివంగత బి వెంకటరమణారెడ్డి ( మా శ్రీవారు) జ్ఞాపకార్థం శనివారం పిల్లలకు మంచి సేవా కార్యక్రమాలను చేయాలని ఉద్దేశ్యంతో లక్కిరెడ్డిపల్లి మండలం దేవలంపల్లి స్కూలుకు క్రీడా దుస్తులు అందించడం జరిగిందని తెలియజేశారు పిల్లలు మంచి ఆరోగ్యంగా ఉండాలని మంచి చదువులు చదువుకోవాలని ఎప్పుడూ తల్లిదండ్రులను గురువులను గౌరవించాలని తెలియజేశారు అనంతరం ప్రధానోపాధ్యాయులు గంగిరెడ్డి మాట్లాడుతూ లయన్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ వారు రాయచోటి నియోజకవర్గం లో చాలా సేవా కార్యక్రమాలు చేస్తున్నారని ఆ భాగంగా మా స్కూల్ కూడా ఇంత మంచి కార్యక్రమం చేయడం సంతోష్ కరమైన విషయం అని లయన్ క్లబ్ వారిని ఆదర్శం తీసుకొని దాతలు ముందుకు వచ్చి మంచి సేవ కార్యక్రమాలు చేయాలని వారికి తెలియజేశారు వ్యవస్థాపక అధ్యక్షులులయన్ పిఎస్ హరినాథ్ రెడ్డి సభ్యులు లయన్ ఎస్ రామాంజనేయరెడ్డి పాఠశాల ఉపాధ్యాయ బృందము తదితరులు పాల్గొన్నారు

# పులివెందుల హౌసింగ్ కాలనీలో రూ.6 కోట్ల ప్రజాధనం గోల్‌మాల్

## ● పులివెందులలో 'రాక్రీట్' సంస్థపై క్రిమినల్ కేసు





**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:-**పులివెందుల పట్టణంలో పేద ప్రజల కోసం నిర్మిస్తున్న జగనన్న హౌసింగ్ కాలనీ గృహ నిర్మాణాల వ్యవహారం తీవ్ర వివాదాస్పదంగా మారింది.ఇళ్ల నిర్మాణంలో భారీగా అవకతవకలు జరిగాయన్న ఆరోపణలతో సంబంధిత కాంట్రాక్టు సంస్థపై పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు.ఈ ఘటనకు సంబంధించిన వివరాలను పులివెందుల డిఎస్పి మురళీ నాయక్ పత్రిక విలేకరుల సమావేశంలో వెల్లడించారు.2021లో గత ప్రభుత్వం పులివెందుల పట్టణంలో గృహ నిర్మాణాల కోసం టెండర్లు పిలిచిందని ఇందులో భాగంగా 'రాక్రీట్' (ఘు-జతీవవ్) అనే ప్రైవేట్ సంస్థకు 4912 ఇళ్ల నిర్మాణ బాధ్యతలు అప్పగించడం జరిగిందని,ఒప్పందం ప్రకారం రెండేళ్లలో పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ,గడువు ముగిసినా నేటికీ లబ్ధిదారులకు ఇళ్లను పూర్తి చేసి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించడం జరిగిందన్నారు.విజిలెన్స్ విచారణలో నిర్మాణాల్లో తీవ్ర అవకతవకలు జరిగినట్లు తేలిందని కాంట్రాక్టర్ నిర్లక్ష్యం మరియు అక్రమాల వల్ల ప్రభుత్వానికి సుమారు రూ.6 కోట్లకు పైగా నష్టం వాటిల్లిందని డిఎస్పి తెలిపారు.జిల్లా హౌసింగ్ అధికారి వి.రాజారత్నం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్‌లో రాక్రీట్ సంస్థ మరియు సైట్ ఇంచార్జ్ గోవర్ధన్ రెడ్డిపై క్రైమ్ నెంబర్ 44/2026 కింద కేసు నమోదు చేసి భారతీయ న్యాయ సంహిత (దీబీూ)లోని పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.జిల్లా ఎస్పీ షల్కే నచ్కేత్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు లోతైన దర్యాప్తు జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని డిఎస్పి మురళీ నాయక్ స్పష్టం చేశారు.

# ఆదరణ'తో శాశ్వత ఉపాధి: మంత్రి సవిత



**తాడేపల్లి మన జనప్రగతి మార్చి 07:-** ఆదరణ 3.0 పథకం బీసీ కుల వృత్తులకు శాశ్వత ఉపాధ కల్పించనున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత స్పష్టంచేశారు. కురుమ, కురుబల అభివృద్ధి సీఎం చంద్రబాబు, టీడీపీతోనే సాధ్యమన్నారు. బీసీల ఉన్నతికి గతంలో ఎన్నడూ కేటాయించని విధంగా భారీ ఎత్తున నిధులు వెచ్చిస్తున్నామన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సవితను గుంటూరు జిల్లాకు చెందిన కురుమ సామాజిక వర్గీయులు శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఆదివారం మహిళా దినోత్సవం సందర్భంగా ఆమెను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సవిత మాట్లాడుతూ, బీసీల అభ్యున్నతికి ఆవిర్భావం నుంచి టీడీపీ కృషి చేస్తోందన్నారు. ఆనాడు అన్న ఎన్టీఆర్, ప్రస్తుతం సీఎం చంద్రబాబు...బీసీలకు అన్నింటా అగ్రతాంబూలం వేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరవాత బీసీలకు ప్రాధాన్యం లభిస్తోందన్నారు. రాజకీయంగా మరింత గుర్తింపు లభించిందన్నారు. త్వరలో రూ.1000 కోట్లతో ప్రారంభించబోయే ఆదరణ 3.0 పథకంలో బీసీలకు అధునాత పరికరాలు అందిస్తూ, శాశ్వత ఉపాధి కల్పిస్తామన్నారు. ఇందుకోసం ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. బీసీ విద్యార్థుల కోసం హాస్టళ్ల రక్షణతో పాటు నాణ్యమైన ఆహారంతో కూడిన విద్య అందిస్తున్నామని మంత్రి సవిత స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కురుమ గుంటూరు జిల్లా కమిటీ అధ్యక్షుడు మర్రి వెంకటసత్యనారాయణ, తట్టి అర్జునరావు, బి.ఉమా మహేశ్వరరావు, ఇతర ప్రతినిధులు పాల్గొన్నారు.

# గౌతమి కళాశాలలో ఘనంగా మహిళా దినోత్సవ వేడుకలు

**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 07:-**ప్రొద్దుటూరు మండలం పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పట్టణంలోని ప్రభుత్వ న్యాయవాది జింకా విజయలక్ష్మి ప్రముఖ గైనకాలజిస్ట్ ఏ సుజన గౌరవ అతిథిగా కరస్పాండెంట్ బాబమ్మ హాజరైనట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా అడ్వకేట్ జింక విజయలక్ష్మి మాట్లాడుతూ మహిళల వ్యక్తిత్వ వికాసాన్ని గురించి మహిళల మనోధైర్యాన్ని వివరించారు ప్రపంచంలోని దేశాలన్నింటిలో భారతదేశం మహిళలకి గౌరవాన్ని ఏ దేశం ఇవ్వదని అలాగే ఒక మంచి సమాజాన్ని నిర్మించడంలో మహిళలు కీలకపాత్ర పోషిస్తున్నారని తెలిపారు డాక్టర్ సృజన మాట్లాడుతూ మహిళల శక్తి ప్రతిభ సహనం మరియు సాధనలను గుర్తు చేసుకునే రోజు అని మహిళల ఆరోగ్యం గా ఉండడం ముఖ్యమని చాలామంది మహిళలు తమ కుటుంబాలు ఆరోగ్యం గురించి ఎక్కువగా ఆలోచిస్తారని తన తమ ఆరోగ్యాన్ని మాత్రం నిర్లక్ష్యం చేస్తారని ఇది సరైనది కాదని తెలిపారు కళాశాల కో డైరెక్టర్ శైలూష మాట్లాడుతూ విద్యార్థులకు మంచి విలువలు శిక్షణతో కూడిన మహిళలుగా తీర్చిదిద్ది వాళ్ళలో నాయకత్వ లక్షణాలను నేర్పించడం వలన సమాజ అభివృద్ధితో పాటు దేశాభివృద్ధి చెందుతుందని తెలిపారు కళాశాల డైరెక్టర్లు నాగురు రవీంద్రారెడ్డి డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు వివిధ విభాగ అధిపతులు ఆలీ కుమార్ జాబీర్ లావణ్య మరియు అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.



# మహిళల పురోగతే సమాజ పురోగతి

## ● మహిళా దినోత్సవ వేడుకల్లో కేటీఆర్




**శేరిలింగంపల్లి మన జనప్రగతి మార్చి 07 :-**నియోజకవర్గం పరిధిలోని చందానగర్ డివిజన్‌లో బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కేటీఆర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా కార్యక్రమానికి విచ్చేసిన కేటీఆర్‌కు దీ=ూ నాయకుడు ఐలాపూర్ మాణిక్ యాదవ్ స్వాగతం పలికారు.కేటీఆర్ మాట్లాడుతూ మహిళలు కుటుంబం మాత్రమే కాకుండా సమాజ నిర్మాణంలో కూడా కీలక పాత్ర పోషిస్తున్నారని తెలిపారు. మహిళలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించడం ద్వారా సమాజం మరింత అభివృద్ధి చెందుతుందని అన్నారు. మహిళల సాధికారత కోసం ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు.అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళల కృషి, త్యాగాలను గుర్తుచేసుకుంటూ వారి అభ్యున్నతికి అందరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పటాన్చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, తండ్రి అంజయ్య యాదవ్, తొంట అంజయ్య యాదవ్, కుమార్ గౌడ్, జగన్నాథ్ రెడ్డి, జగదీష్, చిన్న తదితరులు పాల్గొన్నారు.

# బండ్లగూడ ప్రజల సమస్యపై ఎంపీ రఘునందన్ రావుకు మెట్టు కుమార్ యాదవ్ వినతి



**సికింద్రాబాద్ మన జనప్రగతి మార్చి 07:-**జెపి కాలనీ డివిజన్ పరిధిలోని బండ్లగూడ ప్రాంతంలో రైల్వే లైన్ పునరుద్ధరణ పనుల నేపథ్యంలో స్థానిక ప్రజలు ఇళ్లు కోల్పోకుండా చర్యలు తీసుకోవాలని పటాన్చెరు తాజా మాజీ కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ మెదక్ పార్లమెంట్ సభ్యుడు మాధవనేని రఘునందన్ రావును కలిసి వినతి పత్రం అందజేశారు.దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ అధికారులు పాత రైల్వే ట్రాక్ పునరుద్ధరణ కోసం సర్వే నిర్వహించి, రైల్వే ట్రాక్ ఇరువైపులా 50 మీటర్ల పరిధిలో ఉన్న నిర్మాణాలను తొలగించే అవకాశం ఉందని తెలిపారు. దీంతో దాదాపు 46 సంవత్సరాలుగా అక్కడ నివసిస్తున్న సుమారు 35 కుటుంబాలు ఇళ్లు కోల్పోతామేమోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.ఈ విషయాన్ని ఎంపీ రఘునందన్ రావుకు వివరించిన మెట్టు కుమార్ యాదవ్, పేద కుటుంబాలకు అన్యాయం జరగకుండా జోక్యం చేసుకుని ప్రత్యామ్నాయ స్థలం లేదా ఇళ్లు కల్పించాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంపీ రఘునందన్ రావు సంబంధిత రైల్వే అధికారులతో మాట్లాడి సమస్యపై విచారణ జరిపించారు.ఈ కార్యక్రమంలో బండ్లగూడ దీ=ూ అధ్యక్షుడు భరత్ కుమార్, నిజాంబాద్ శ్రీను, మాజీ వార్డ్ మెంబర్ లక్ష్మణ్, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

# కె.వెలమవారిపల్లి వార్డు సచివాలయంలో ఘనంగా ముందస్తు మహిళా దినోత్సవ వేడుకలు



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:-**115 వఅంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పులివెందుల మున్సిపాలిటీలోని కె.వెలమవారిపల్లివార్డు సచివాలయంలో శనివారం ముందస్తు వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించారు.సచివాలయ ఇన్చార్జి అడ్మిన్ కె.నాగలింగం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా ఉద్యోగుల సేవలను కొనియాడారు.సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న మహిళా కార్యదర్శులు ఎస్.పర్వీన్ బేగం (మహిళా సంక్షేమ కార్యదర్శి), దుస్స లక్ష్మి (హెల్త్ సెక్రటరీ)మరియు బండి లక్ష్మి దేవి (శానిటరీ కార్యదర్శి) లను సచివాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.వారికి శాలువాలు కప్పి,కేక్ కటింగ్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళా ఉద్యోగుల పాత్ర వెలకట్టలేనిదని ఈ సందర్భంగా వక్తలు పేర్కొన్నారు.ఈ వేడుకల్లో మున్సిపల్ అధికారులు ఆర్వో వా.మాన్సుమ్ బాషా, డిఈ కిరణ్ కుమార్, సుబ్రహ్మణ్యం, ఏపిఎం డి.ఆంజనేయులు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.వీరితో పాటు సచివాలయ సిబ్బంది జి. గణేష్,ఎస్.బాబు, ఎస్.అబుల్ రవూఫ్ తదితరులు పాల్గొని మహిళా ఉద్యోగులకు సంఘీభావం తెలిపారు.

# మత్తుకు దూరంగా భవిష్యత్తుకు దగ్గరగా రాయచోటిలో పోలీసుల నాకాబందీ



**అన్నమయ్య జిల్లా బ్యూరో మన జనప్రగతి మార్చి 07:-**రాయచోటి పట్టణం రాయుడు కాలనీలో డిఎస్పీ కృష్ణమోహన్, తహశీల్దార్ నరసింహకుమార్ ఆధ్వర్యంలో శనివారం 'నాకాబందీ' నిర్వహించారు. సిఐ వెంకటాచలపతి నేతృత్వంలో వాహనాలను తనిఖీ చేసి, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసలై ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని హితవు పలికారు.సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఆధార్, బ్యాంక్ వివరాలను ఎవరికీ తెలపవద్దని సూచించారు. వాహనాలు కొనుగోలు చేసేటప్పుడు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని తెలిపారు. జిల్లాను మత్తు రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరుతూ అందరితో ప్రతిజ్ఞ చేయించారు. అనుమానితుల సమాచారాన్ని వెంటనే పోలీసులకు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ, పోలీస్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మన జనప్రగతి
జనం కోసం.. అక్షర ప్రగతి... తెలుగు దినపత్రిక
08 -03-2026

# పులివెందులలో పోలీసుల వజ్ర ప్రహార్ గర్జన

**ఒకే రోజు భారీ సోదాలు,పాత నేరస్తులపై నిఘా**

**ప్రజలకు భద్రత కల్పించడమే మా ప్రథమ ప్రాధాన్యత**

**పులివెందుల డిఎస్పి బి.మురళి నాయక్**



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:-** పులివెందుల పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే ధ్యేయంగా పోలీసులు ముమ్మర కార్యాచరణను ప్రారంభించమని,ప్రజలకు భద్రత కల్పించడమే మా ప్రథమ ప్రాధాన్యత అని శనివారం ఉదయం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పులివెందుల డీఎస్పీ బి.మురళి నాయక్ అన్నారు.డిఎస్పి మాట్లాడుతూ,అటు క్షేత్రస్థాయిలో సోదాలు నిర్వహిస్తూనే,ఇటు పాత నేరస్తుల కదలికలపై గట్టి నిఘా ఉంచినట్లు వెల్లడించారు.రాష్ట్ర డీజీపీ హరీష్ కుమార్ గుప్తా,ఐజీ ఆర్.కె.రవికృష్ణ ఆదేశాల మేరకు కడప జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ పర్యవేక్షణలో శనివారం తెల్లవారుజామున 4 గంటలకే ఈ ఆపరేషన్ ప్రారంభమైందని,పులివెందుల సబ్ డివిజన్ పరిధిలోని నగరి గుట్ట మరియు పరిసర ప్రాంతాల్లో పులివెందుల రూలర్ సీఐ సీతారామిరెడ్డి ట్రాఫిక్ సిఐ కే శాంతి లాల్,పులివెందుల టౌన్ ఎస్సై మధుసూదన్ రెడ్డి,తిమోతి, వేముల ఎస్సై ప్రవీణ్,తొండూరు ఎస్సై మద్దిలేటి,లింగాల ఎస్సై జగదీష్,చక్రాయపేట ఎస్సై చంద్రశేఖర్,ఆర్కే వ్యాలీ ఎస్సై శ్రీప్రియ మరియు 60 మంది సబ్ డివిజన్ సిబ్బందితో కలిసి సుమారు 500 ఇళ్లలో ముమ్మర తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.గంజాయి,డ్రగ్స్,అక్రమ మద్యం (సారాయి) సరఫరాను అరికట్టడంతో పాటు బెల్ట్ షాపుల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి సారించమని,సరైన ధ్రువపత్రాలు లేని 45 ద్విచక్ర వాహనాలు,2 ఆటోలను స్వాధీనం చేసుకుని,ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ వాహనాలను మోటార్ వాహనాల శాఖకు అప్పగిస్తామన్నారు.శాంతిభద్రతల సమీక్షలో భాగంగా గతంలో జరిగిన పలు దొంగతనం కేసుల పురోగతిని డీఎస్పీ వివరించారు.సింహాద్రిపురంలో జరిగిన 5 చైన్ స్నాచింగ్ కేసుల్లో బీహార్‌కు చెందిన దిలీప్ అనే నిందితుడిని గుర్తించమని ఇతను కర్ణాటకలోని రాయల్‌పాడులో కూడా నేరాలకు పాల్పడినట్లు నిర్ధారించుకున్నామని అన్నారు.పులివెందుల, సింహాద్రిపురం,తొండూరు ప్రాంతాల్లో జరిగిన 15 కాపర్ వైర్ దొంగతనాల కేసుల్లో రూ. 7 లక్షల విలువైన ఆస్తిని రికవరీ చేశామని,సబ్ డివిజన్ పరిధిలోని 50 నుండి 60 మంది రౌడీ షీటర్ల ప్రవర్తనను పర్యవేక్షిస్తున్నామని,సత్ప్రవర్తన కలిగిన 50 మందిని రౌడీ షీట్ల నుండి తొలగించామని తెలిపారు.డీఎస్పీ మాట్లాడుతూ ప్రతి సర్కిల్ ఇన్ స్పెక్టర్ పరిధిలో ఇకపై డ్రోన్ల ద్వారా నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.ఈ నెల చివరలో జరగనున్న పంచాయతీ ఎన్నికల దృష్ట్యా అసాంఘిక శక్తులపై కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు.ప్రజలు మరియు రైతులు పొలాల వద్ద అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.వజ్ర ప్రహార్ వంటి దాడులు వేంపల్లి టౌన్ తో పాటు అన్ని మండల కేంద్రాల్లో నిరంతరం కొనసాగిస్తామని ప్రజలకు భద్రత కల్పించడమే మా ప్రథమ ప్రాధాన్యత అని డీఎస్పీ ఈ సమావేశంలో పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో పులివెందుల రూలర్ సీతారామరెడ్డి పులివెందుల ట్రాఫిక్ సిఐ కె శాంతి లాల్ పాల్గొన్నారు.

# వజ్రప్రహార్‌లో భాగంగా మెగా కార్డన్ డే



**పత్తికొండ మన జనప్రగతి మార్చి 07:-** రాష్ట్రంలోని అన్ని జిల్లాల పోలీస్ సబ్ డివిజన్లు ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా ఆదేశాల మేరకు ఈగల్ చీఫ్ ఆకే రవి కృష్ణ ఐ జి పి పర్యవేక్షణలో, కర్నూలు డీఐజీ కోయ ప్రవీణ్ ఉత్తర్వుల మేరకు, డీఐజీ, ఇన్చార్జి ఎస్పి .విక్రాంత్ పాటిల్ ఆద్వర్యములో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల నియంత్రణకు చేపట్టిన ప్రత్యేక కార్యక్రమం “ఆపరేషన్ వజ్రప్రహార్” లో భాగంగా, రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాలలోని పోలీసు సబ్ డివిజన్‌లలో శనివారం రోజు మెగా కార్డన్ సెర్చ్ ఆపరేషన్ విస్తృతంగా నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు సంబంధిత నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు.ఈ మెగా కార్డన్ అండ్ సర్చ్ ఆపరేషన్‌ను పత్తికొండ సబ్ డివిజన్ లో డిఎస్పీ బి. వెంకట రామయ్య ఆధ్వర్యంలో నిర్వహించారు. పోలీసు అధికారులు, సిబ్బంది, స్పెషల్ టీమ్‌లు కలిసి గుర్తించిన హాట్‌స్పాట్ ప్రాంతాలలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ముఖ్యంగా మాదకద్రవ్యాల వినియోగం జరుగుతున్నట్లు అనుమానం ఉన్న ప్రాంతాలు, అద్దె ఇళ్లు, చిన్న లాడ్జీలు, ఖాళీ భవనాలు, బస్ స్టాండ్లు, మరియు ఇతర అనుమానాస్పద ప్రదేశాలలో మరియు పాత గంజాయి మరియు నార్కోటిక్ కేసులలో ఉన్నటువంటి ముద్దాయిలను పోలీసులు సోదాలు నిర్వహించారు.ఈ కార్డన్ సెర్చ్ ఆపరేషన్‌లో భాగంగా మొత్తం 70 మంది పోలీసు అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు విస్తృతంగా తనిఖీలు నిర్వహించి ప్రజల వివరాలు, వాహనాల వివరాలు మరియు అనుమానాస్పద వ్యక్తులపై పరిశీలన చేపట్టారు.ఈ ఆపరేషన్‌లో భాగంగామొత్తం 200 మంది వ్యక్తులను తనిఖీ చేశారు200 వాహనాలను తనిఖీ చేశారుసరైన పత్రాలు లేని 64 వాహనాలను గుర్తించారు.9 వాహనాలను సీజ్ చేశారు.మొత్తం 1 బైండ్ ఓవర్ కేసు నమోదు చేశారురౌడీ షీటర్లు మరియు సస్పెక్ట్ షీట్లు ఉన్న వ్యక్తులను స్పాట్ లో పిలిపించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించి వారికీ సత్ప్రవర్తనతో మెలగాలని సూచించారు.ఈ సందర్భంగా పోలీసు అధికారులు ప్రజలకు మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, సామాజిక మరియు చట్టపరమైన దుష్పరిణామాల గురించి అవగాహన కల్పించారు. గంజాయి మరియు ఇతర మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, కుటుంబ వ్యవస్థపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు.ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో గంజాయి లేదా ఇతర మాదకద్రవ్యాలకు సంబంధించిన సమాచారం ఉంటే వెంటనే ఏపీ ఈగల్ టీం టోల్ ఫ్రీ నెంబర్ 1972 కు సమాచారం అందించాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు. సమాచారం ఇచ్చే వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయని హామీ ఇచ్చారు.అదేవిధంగా ఈ కార్యక్రమంలో భాగంగా పోలీసు అధికారులు, సిబ్బంది మరియు ప్రజలతో కలిసి “ఆపరేషన్ వజ్రప్రహార్ ప్రతిజ్ఞ” నిర్వహించి మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాడాలని ప్రతిజ్ఞ చేశారు. సమాజాన్ని డ్రగ్స్ రహితంగా మార్చడంలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యమని ఈ సందర్భంగా అధికారులు పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాదకద్రవ్యాల వ్యాప్తిని పూర్తిగా అరికట్టే దిశగా “ఆపరేషన్ వజ్రప్రహార్” కింద ఇలాంటి ప్రత్యేక చర్యలు నిరంతరం కొనసాగుతాయని పోలీసులు తెలిపారు. ప్రజల సహకారంతో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

# ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం



**పులివెందుల అర్బన్ మన జనప్రగతి మార్చి 07:-** పులివెందుల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ప్రిన్సిపల్ శ్రీనివాసులు అధ్యక్షతన ముందస్తు వేడుకలు శనివారం కళాశాల ఉమెన్ సెల్ విభాగం మరియు స్నేహిత అమృత హస్తం సేవాసమితిల సంయుక్త ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ అనుకున్న లక్ష్యాలు సాధించినప్పుడే మహిళలకు సాధికారత లభిస్తుందని అన్నారు.ఈ వేడుకలకు ముఖ్య అతిధిగా హాజరైన జూనియర్ సివిల్ జడ్జి చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ బ్రిటిష్ వారి పాలన కారణం గానో లేక స్వాతంత్ర్యం లెకనో అప్పట్లో మహిళల పట్ల వివక్ష ఉండేదని,ప్రస్తుతం ప్రతి మహిళా విద్యను అందిపుచ్చుకుని అన్ని రంగాలలో పురుషులతో సమానంగా రానిస్తూ,ఆర్థిక పరమైన సహకారంతో కుటుంబంలో వెలుగులు నింపుతోందని,చిన్న చిన్న పొరపాట్లకు కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్న తరుణంలో న్యాయ స్థానాన్ని ఆశ్రయిస్తూ ఉన్నారని,న్యాయ స్థానం సేవలను సద్వినియోగం చేసుకొంటూ కుటుంబ వ్యవస్థను కాపాడుకోవలసిన బాధ్యత ప్రతి మహిళకు ఉందన్నారు.వైస్ ప్రిన్సిపల్ శ్రీనిత మాట్లాడుతూ విజయం సాధించిన వారిని స్ఫూర్తిగా తీసుకుని ప్రతి విద్యార్థి జీవితంలో ఉన్నత స్థాయికి చేయాలన్నారు. మహిళా సాధికారత సమన్వయకర్త డా.కె.విజయలక్ష్మి మాట్లాడుతూ ప్రతి మహిళా జీవితంలో ఎదురయ్యే కష్టాలను, బాధలను,అవమానాలను ధైర్యంగా ఎదుర్కొని ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ వరప్రసాద్ పాల్గొని వివిధ పోటీలలో ప్రతిభ చూపిన విజేతలకు బహుమతులు అందజేశారు.తర్వాత ప్రిన్సిపల్ మహిళా అధ్యాపక,అధ్యాపకేతర సిబ్బందిని సన్మానించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత వైస్ ప్రిన్సిపల్ బాలనారాయణ, ప్రొడ్యూసర్ మంజునాథ్ రెడ్డి , పులివెందుల హరి,స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు,సభ్యులు రాఘవేంద్ర రెడ్డి,అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

# ఎడ్ల అనిల్ అనూష్ ఆధ్వర్యంలో కేసీఆర్ కప్



**గంగాధర మన జనప్రగతి మార్చి 07:-** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలంలో ఈరోజు ఎడ్ల అనిల్ - అనుష్ ఆధ్వర్యంలో గత నెల రోజుల నుండి జరుగుతున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ లో 90 జట్లు పాల్గొనగ ఈ రోజు తుది పోరు ఫైనల్ మ్యాచ్ కి ముఖ్య అతిధి గా గౌరవ సిద్దిపేట ఎమ్మెల్యే ,మాజీ రాష్ట్ర మంత్రివర్యులు తన్నీరు హరీష్ రావు విచ్చేసి బహుమతులు మొదటి బహుమతి ప్రదానం చేయడం జరిగింది . మాల్యాల్ ,రెండవ బహుమతి గంగాధర క్రికెట్ అసోసియేషన్,మూడవ బహుమతి శ్రీహరి సోల్జర్స్, నాలుగవ బహుమతి రామడుగు రాయల్స్ నిలిచారు .ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ,చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సంకే రవి శంకర్,కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ,కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జి వి రామకృష్ణ ,వీర్ల వెంకటేశ్వర్లు , మాజీ గ్రంథాలయ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి ,బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు ఠాగూర్ ,క్రీడాకారులు,పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు,ప్రేక్షకులు ,క్రీడాకారులు పాల్గొన్నారు.

# వడదెబ్బ నివారణపై ప్రజలకు అవగాహన



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 07:-**మండల పరిధిలోని ఉంతకల్లు గ్రామంలో వేసవి కాలం ప్రారంభమవడంతో ఎండలు ఎక్కువగా ఉండటంతో వడదెబ్బ తగిలే ప్రమాదం పెరుగుతుందని ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వైద్యాధికారులు మాట్లాడుతూ.. పొలం పనులు,ఇతర ప్రయాణాలు ఉదయం త్వరగా ప్రారంభించి ఉదయం పది గంటల లోపు పూర్తి చేసుకోవాలని సూచించారు. మధ్యాహ్నం తీవ్ర ఎండల్లో బయటకు వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలని తెలియజేశారు.వడదెబ్బ తగిలిన వ్యక్తిని వెంటనే సమీప ఆస్పత్రికి తరలించి చికిత్స అందించాల్సిన అవసరం ఉందని వివరించారు.అలాగే ప్రజలు నూలు దుస్తులు ధరించడం, రుమాలు,టోపీలు,గొడుగులు ఉపయోగించడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఎక్కువగా నీళ్లు తాగడం, ఓఆర్ఎస్ ద్రావణం,కొబ్బరి నీళ్లు తీసుకోవడం ద్వారా శరీరానికి చల్లదనం కలిగించి వడదెబ్బను నివారించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ చిలకమ్మ,ఆరోగ్య కార్యకర్తలు శర్మస్,బి.గోవర్ధన్,గ్రామ సర్పంచ్ ముక్కన్న,మాజీ ఎంపీటీసీ కేంచప్ప,ఆశ కార్యకర్తలు లక్ష్మి, వన్నూరమ్మ,శాంతి మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# పట్టద దేవర పట్టాభిషేకం సందర్భంగా ఉచిత వైద్య శిబిరం




**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 07:-**మండలంలోని ఉంతకల్లుగ్రామంలో పట్టద దేవర పట్టాభిషేకం సందర్భంగా గ్రామస్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు.ఈ శిబిరంలో గ్రామ ప్రజలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వైద్య సలహాలు అందజేశారు.ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని,ఏవైనా ఆరోగ్య సమస్యలు ఉన్నట్లయితే సమీప ఆరోగ్య కేంద్రాలను సంప్రదించాలని వైద్య సిబ్బంది సూచించారు.ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్స్ చిలకమ్మ, ఆరోగ్య కార్యకర్తలు శర్మస్, బి. గోవర్ధన్,ఆశ కార్యకర్తలు లక్ష్మి, వన్నూరమ్మ,శాంతి పాల్గొన్నారు. గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య సేవలను పొందారు.

# చల్లా రాజన్న ఆధ్వర్యంలో కొనసాగుతున్న అన్నదానం

**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 07:-** ప్రొద్దుటూరు టిడిపి పట్టణ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ యాదవ్ ఆధ్వర్యంలో ప్రతి శనివారం మరియు పౌర్ణమి రోజున అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. అందులో భాగంగా శనివారం మైదుకూరు రోడ్డు లోని అన్వర్వాలు వద్ద ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈ అన్నదాన కార్యక్రమంలో సుమారు వెయ్యి మంది పాల్గొన్నారు ఈ సందర్భంగా అన్నదానం కార్యక్రమంలో పాల్గొన్న వారు తమ సంతృప్తిని వ్యక్తం చేస్తూ పట్టణంలోని పాదచారులకు నిరాశేయులకు నిరుపేదలకు తన అన్నదానంతో భోజనం వసతి కల్పిస్తున్న చల్లా రాజగోపాల్ యాదవ్ అభినందనీయుడని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల మన్ననలు పొందాలని ఆయనకు శక్తిని ప్రసాదించాలని భగవంతుని వేడుకున్నారు ఈ కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్ మూరబోయిన శ్రీనివాస్ యాదవ్ నల్లం రవిశంకర్ బంగి శివ జయచంద్ర బోడె ప్రసాద్ యేసునాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ప్రకృతి సాగుతో ఆదాయం, ఆరోగ్యం: మంత్రి సవిత

**విజయవాడ మన జనప్రగతి మార్చి 07:-** ప్రకృతి వ్యవసాయంతో ఆదాయంతో పాటు ఆరోగ్యం కూడా లభిస్తుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. వ్యవసాయం భారం కాకుండా లాభసాటి కావాలంటే ప్రకృతి సాగే సరైన విధానమని స్పష్టం చేశారు. విజయవాడలోని ఓ హోటల్లో శనివారం ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల కోసం నిర్వహించిన ప్రకృతి వ్యవసాయంపై వర్క్ షాప్ లో పాల్గొని ప్రసంగించారు. ప్రకృతి సాగుపై వర్క షాప్ నిర్వహించడం అభినందనీయమన్నారు. ఆర్థికంగా వెనుకబడిన వర్గాల వారిని ఆర్థికంగా బలోపేతం చేయడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గాల అభ్యున్నతికి ఒకవైపు సంక్షేమ పథకాలు అమలు చేస్తూనే... మరో వైపు స్వయం సమృద్ధి కోసం ఇటువంటి కార్యక్రమాలను సీఎం చంద్రబాబునాయుడు నిర్వహిస్తున్నారన్నారు. దేశంలోనే అత్యధిక మంది జీవనాధారం వ్యవసాయమన్నారు. ప్రస్తుతం ఎరువులు, పురుగు మందుల ధరలు పెరుగుతుండడంతో, వ్యవసాయ పెట్టుబడి భారంగా మారిందన్నారు. వ్యవసాయంలో ఖర్చును తగ్గిస్తూ, లాభాలు పెంచడానికి ప్రకృతి సాగు ఎంతో దోహదపడుతుందన్నారు. రసాయనాలపై ఆధారపడకుండా సహజ వనరులతో వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చొచ్చునన్నారు. అటు ఆరోగ్యం, ఇటు ఆదాయం ప్రకృతి వ్యవసాయం వల్లే సాధ్యమవుతుందన్నారు. అందుకే కూటమి ప్రభుత్వం ఆర్గానిక్ వ్యవసాయం ఆవశ్యకత



గురించి పెద్దఎత్తున ప్రచారం చేస్తోందన్నారు. జీవామృతం, ఘన జీవామృతం వంటి సహజ వనరుల వినియోగంతో నేల సారం పెరుగుతుందన్నారు. కరోనా నుంచి ప్రజల ఆహారపు అలవాట్లు మారాయని, ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందని అన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారన్నారు. ఆర్గానిక్ ఉత్పత్తులను ఆహారంగా తీసుకోవడం ద్వారా క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులకు దూరంగా ఉండొచ్చునన్నారు. ప్రకృతి సాగు ఉత్పత్తులకు అధిక ధరతో పాటు డిమాండ్ కూడా ఎక్కువేనన్నారు. ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గీయుల్లో ఉన్న రైతులు ప్రకృతి సాగుపై దృష్టి సారించి, అధిక లాభాలు సాధించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర స్థాయితో పాటు జిల్లా స్థాయిలోనూ ఇటువంటి వర్క్ షాపులు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. వర్చువల్ గా ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ రైతు సాధికార సమితి వైస్ చైర్మన్ టి.విజయ్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రకృతి వ్యవసాయం చేసే రైతుల సంఖ్య 60 లక్షలకు చేర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యమన్నారు. ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా సాధ్యమవుతుందన్నారు. రాష్ట్ర ఈడబ్ల్యూఎస్ సంక్షేమ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.సునీత మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయంపై ఆర్థిక వెనుకబడిన వర్గీయులను మొగ్గుచూపేలా అవగాహన సదస్సు నిర్వహిస్తున్నామన్నారు. అంతకుముందు సేంద్రీయ ఎరువులతో సాగుచేసిన కూరగాయలు, అపరాలు, ఇతర వ్యవసాయ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి సవిత పరిశీలించారు. ఏయే సహజ వనరులు వినియోగించి ప్రకృతి సాగు చేశారో అడిగి తెలుసుకుని, రైతులను అభినందించారు. అనంతరం వర్క్ షాప్ ను మంత్రి సవిత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వివిధ కార్పొరేషన్ చైర్మన్లు బుచ్చి రాంప్రసాద్, బ్రహ్మం చౌదరి, డూండీ రాకేశ్, ఈడబ్ల్యూఎస్ అధికారులు, రాష్ట్రంలో వివిధ ప్రాంతాలకు చెందిన ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన రైతులు పాల్గొన్నారు.

# పుష్పాలంకరణలో ఆంజన్నకు ప్రత్యేక పూజలు



**బొమ్మనహాల్ మన జనప్రగతి మార్చి 07:-** మండలంలో నేమకల్లు గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం అంజన్నకు వివిధ పుష్పాలంకరణలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారిని దర్శించుకోవడానికి నలుమూల ప్రాంతాల నుండి వేలాదిమంది భక్తులు హజరై అంజన్నకు మొక్కులను తీర్చుకున్నారు, ఈ సందర్భంగా ఆలయ ప్రధానఅర్చకులు అనీల్ కుమార్ చార్యులు ఆధ్వర్యంలో అంజన్న స్వామి కి విగ్రహానికి వేధమంత్రోచ్చారణల మధ్య అంజన్నకు ప్రత్యేక పూజలను నిర్వహించారు, తెల్లవారుజామునేపవిత్ర జలంను తీసుకోనివచ్చి స్వామీ వారి విగ్రహానికి అభిషేకంను నిర్వహించారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ కుంకుమార్చన, పంచామృతాభిషేకం ఆకుల పూజ, ప్రత్యేక అలంకరణతో పూజలను నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన భక్తులకు అన్నదాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అన్నసంతర్పన నిర్వహించారు, ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు అన్నదాన కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

# ప్రపంచంలో ఆర్థిక మాంద్యం త్వరలో రాబోతుంది

## • మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతామోహన్

**కడప మన జనప్రగతి మార్చి 07:-** ప్రపంచంలో ఆర్థిక మాంద్యం త్వరలో రాబోతుందని మాజీ మంత్రి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చింతామోహన్ శనివారం కడప నగరంలోని ప్రెస్ క్లబ్ నందు ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెక్స్ రాకెట్ ముఠా లిస్టు ఇరాన్ దేశం దగ్గర వుంది. ఆ లిస్టు భయటపడుతుందనే అనుమానంతో ఆదేశంపై యుద్ధం జరుగుతుంది ఎఫ్టీన్ అనే వ్యక్తి ఒక సెక్స్ బ్రోకర్. ప్రపంచ దేశాధినేతల బలహీనతలను వాడుకున్నాడు. త్వరలో దేశాధినేతలు చేసిన పొరపాట్లు ఫోటోలు, వీడియోలు బయటికి రాబోతున్నాయి. భారత దేశంలో బిజెపి ప్రభుత్వంనితీష్ ను మింగినట్లే చంద్రబాబును కూడా మింగబోతుంది. ఏపీకి ఎవరు ముఖ్యమంత్రి అవుతారో కాలమే నిర్ణయిస్తది. వైయస్ కుటుంబం 11 ఏళ్ళు ముఖ్యమంత్రి పదవి అనుభవించింది. కడప జిల్లాకు ఒక్క మంచి పనైనా చేసిందా? ఈ మధ్యకాలంలో ప్రపంచంలో ఉన్న దేశాధినేతలు పొరపాట్లు



చేయడం ప్రారంభించారుతలెత్తుకుని తిరగాల్సిన దేశాధినేతలు తలదించుకునే రోజులు వస్తున్నాయి. అందుకే భయపడుతున్నారు. రానున్న రోజుల్లో ఆర్థిక మాంద్యం రాబోతుంది. రూపాయి విలువ పడిపోతుంది. అన్నీ రకాల వస్తువుల ధరలు విపరీతంగా పెరగనున్నది. ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ మొదలు, మన్మోహన్ సింగ్ కాలం వరకు భారతదేశం హుందాగా ఉన్నది. రష్యా దగ్గర చమురు కొనుగోలుకు నెల రోజుల గడువు విధించడం పరిశీలిస్తే, చీణాూ ప్రభుత్వ ట్రంప్ కి, ఎంతలా సరెండర్ అయిందో తెలుస్తది. నితీష్ కుమార్ బలిజ/ కాపు కులానికి చెందిన వ్యక్తి. బిజెపి ప్రభుత్వానికి లొంగిపోయాడు. బిజెపి, ఉత్తరప్రదేశ్ ను ఎట్లా కభలించిందో , బిహార్ ను కూడా అట్లాగే మింగేయబోతది. చంద్రబాబు నాయుడు సంవత్సర కాలం కంటే, ఎక్కువ రోజులు ముఖ్యమంత్రిగా ఉంటాడనే నమ్మకం నాకైతే లేదు. నితీష్ ను మింగినట్లే, చంద్రబాబును కూడా బిజెపి మింగబోతది. ఏపీ ముఖ్యమంత్రి ఎవరు అవుతారో కాలమే నిర్ణయిస్తది. వైయస్ కుటుంబం 11 ఏళ్ళు ముఖ్యమంత్రి పదవి అనుభవించింది. తిరుపతి నుంచి, కడప వరకు ప్రయాణం చేస్తుంటే, ఎటువంటి అభివృద్ధి నాకైతే కనపడలేదు. ఒక చిన్న కుటుంబంలో పుట్టిన చంద్రబాబు నాయుడు, కరుణానిధి కుమారుడు కంటే, కోటీశ్వరుడు అయ్యాడు. బిలీనియర్ అయ్యాడు. వైఎస్ కుటుంబం కూడా ఒక చిన్న కుటుంబంలో పుట్టింది. వైయస్ జగన్ మాజీ ముఖ్యమంత్రులే కాదు, ముఖ్యమంత్రులందరిలో కంటే, అత్యంత సంపన్నుడు అయ్యాడు. కడప ఎమ్మెల్యే గారు రోడ్డు వేసుకునేదానికి, ఒక కోటి రూపాయలు చేయలేకపోతున్నారు. అమరావతిలో కర్రతుమ్మ చెట్టు కొట్టే దానికి, 1000/ కోట్లు రూపాయలు ఖర్చు చేస్తారు. కడప రోడ్డుకు కోటీ రూపాయలు ఇవ్వలేరా? అని ముఖ్యమంత్రిని చింతామోహన్ ప్రశ్నించారు. రాయచోటిని కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే జిల్లా కేంద్రం చేస్తామన్నారు. అలాగే ఉమ్మడి రాయలసీమ జిల్లాల్లో లక్ష మంది నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తామని తెలిపారు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రవి పాల్గొన్నారు.

# గౌతమి మహిళా కళాశాల విద్యార్థినిల ర్యాలీ

**ప్రొద్దుటూరు మన జనప్రగతి మార్చి 07:-** ప్రొద్దుటూరు మండల పరిధిలోని మహిళా ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా పట్టణంలోని రాజీవ్ సర్కిల్ నుండి శివాలయం సర్కిల్ వరకు విద్యార్థినిలతో ర్యాలీ నిర్వహించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం రామసుబ్బమ్మ తెలిపారు ఈ ర్యాలీలో భాగంగా విద్యార్థులు సమాజంలో నేడు మహిళలకు జరుగుతున్న అన్యాయాలను అఘాయిత్యాలను వివరిస్తూ మహిళలు అన్ని రంగాలలో ముందున్నారని తెలిపారు. మహిళలకు గౌరవం సమాజానికి అభివృద్ధి మహిళలు ముందుకు దేశం ముందుకు మహిళా సాధికారతే నిజమైన స్వాతంత్రం లాంటి నినాదాలతో ర్యాలీ ముందుకు కదిలింది అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రవీంద్రారెడ్డి కరస్పాండెంట్ బాబమ్మ కో డైరెక్టర్ సొల్యూషన్ డిప్లమా ప్రిన్సిపల్ ప్రకాష్ రావు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ మరియు ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ కన్వీనర్ వి సుజాత పూజిత ఎన్ఎస్ఎస్ కన్వీనర్ కే స్వరూప్ వివిధ విభాగధిపతులు ఆలీ సుకుమార్ జబీర్ లావణ్య మరియు అధ్యాపకులు పాల్గొన్నారు.

# గత పాలకులది చెత్త పాలన: మంత్రి నారాయణ




**నెల్లూరు మన జనప్రగతి మార్చి 07:-** దొంతాలి డంపింగ్ యార్డు ను శనివారం సాయంత్రం మంత్రి నారాయణ పరిశీలించారు. చెత్త తొలగింపు ప్రక్రియను మరింత వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. గతప్రభుత్వం చెత్త ప్రభుత్వం అని, ప్రజలపై చెత్త పన్ను వేసి 153 లక్షల చెత్తను రాష్ట్రంలో వదిలి వెళ్ళిందని ఆయన విమర్శించారు. మున్సిపల్ వ్యవస్థను కూడా గత పాలకులు సర్వనాశనం చేశారని చెప్పారు. వైసీపీ చేసిన అవకతవకలనుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్నామని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత సీఎం చంద్రబాబు సమీక్ష నిర్వహించి 2025 అక్టోబర్-2 నాటికి రాష్ట్రంలో చెత్తనంతా తొలగించాలని ఆదేశాలిచ్చినట్టు మంత్రి నారాయణ గుర్తు చేశారు. ఆయన నిర్దేశానుసారం 85 లక్షల చెత్తను తొలగించామని, గ్రౌండ్ లెవల్ కంటే కింద ఉన్న చెత్తను ఇప్పుడు తొలగిస్తున్నామని అన్నారు. ఇప్పటి వరకు 115 లక్షల టన్నుల చెత్తను తొలగించామని మిగిలిన చెత్తను జూన్ నాటికి తొలగిస్తామని వివరించారు. దొంతాలిలో 50 ఏళ్లుగా డంపింగ్ యార్డు ఉందని, ఇక్కడ 6.73 లక్షల టన్నుల చెత్త పేరుకుపోయిందని, వీలైనంత త్వరగా చెత్తను తొలగిస్తామని ఆయన చెప్పారు. ఈ ప్రాంతంలో జిందాల్ కంపెనీ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్ ను జిందాల్ కంపెనీ ఏర్పాటు చేస్తోందని, నెల్లూరుకు 100 కిలోమీటర్ల పరిధిలోని చెత్త అంతా ఈ ప్లాంటుకు తరలిస్తామని చెప్పారు. 2014 లోనే తమ ప్రభుత్వం 10 ప్లాంట్లను మంజూరు చేసి విశాఖ, గుంటూరు ప్లాంట్లను పూర్తి చేసిందని, అవగాహన లేక మిగిలిన ఎనిమిది ప్లాంట్లను గతప్రభుత్వం నిలిపేసిందని ఆయన విమర్శించారు. తిరిగి కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత మరో ఆరు ప్లాంట్లు మంజూరు చేశామని, ఇప్పటికే నాలుగు ప్లాంట్ల పనులు ప్రారంభమయ్యాయని చెప్పారు. విజయవాడ, తిరుపతిలో కూడా ప్లాంట్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాబోయే రెండేళ్లలో 8 ప్లాంట్లు అందుబాటులోకి వస్తాయని అన్నారు. రాష్ట్రంలో రోజుకి 7 వేల టన్నుల చెత్త వస్తుందని, అందులో 6500 టన్నులు వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లకు చేరి విద్యుత్ గా మారుతుందని చెప్పారు. చైనాలో 1100 వేస్ట్ ఎనర్జీ ప్లాంట్ లు ఉన్నాయని, జపాన్ లో 1000 ఉన్నాయని, అభివృద్ధి చెందిన దేశాల్లో వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లతోనే చెత్త రహితం చేస్తున్నారని అన్నారు. ఏపీ లో కూడా డంపింగ్ యార్డులే లేకుండా చేయాలన్నది సీఎం చంద్రబాబు నాయుడి ఆలోచన అని, చెత్త రహిత రాష్ట్రంగా ఏపీని రోల్ మోడల్ గా నిలుపుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు కార్పొరేషన్ కమీషనర్ నందన్, మేయర్ దేవరకొండ సుజాత అశోక్, టీడీపీ నేత వేమిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తాళ్ళపాక అనూరాధ, ఇంజినీరింగ్ అధికారులు, ఎమ్మార్వో రవికుమార్, టీడీపీ, బీజేపీ నేతలు పాల్గొన్నారు .

# 15న శ్రీ ఆచలానంద స్వామి ఆరాధన ఉత్సవాలు

## ఒంగోలు, బ్రహ్మంగారిమఠంలో ఏర్పాట్లు: శ్రీ విరజానంద స్వామి వెల్లడి

**కడప మన జనప్రగతి మార్చి 07:-** కలియుగ కాలజ్ఞాని శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి శిష్యులు శ్రీ అచలానంద స్వామి ఆరాధన ఉత్సవాలు ఈనెల 15వ తేదీన ఒంగోలు, బ్రహ్మంగారిమఠంలోని తోటపల్లె వద్ద ఉన్న శ్రీ అచలానంద ఆశ్రమంలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేపట్టినట్లు బ్రహ్మంగారిమఠం శ్రీ అచలానానంద ఆశ్రమ పీఠాధిపతి శ్రీ విరజానంద స్వామి వెల్లడించారు. 15వ తేదీన ఉదయం 10 గంటలకు స్వామివారి పాదుకలకు అభిషేక కార్యక్రమాలు ఉంటాయన్నారు. అనంతరం 11 గంటల నుంచి సత్సంగము, ప్రవచనం, భక్తుల అనుభవాలు ఉంటాయన్నారు. 12:30 గంటలకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఒంగోలులోని శ్రీ అచలానంద ఆశ్రమంలో ఆశ్రమ పీఠాధిపతి శ్రీ పరిపూర్ణ సిద్ధా నంద స్వామి ఆధ్వర్యంలో శ్రీ అచలానంద స్వామి వారి ఆరాధన ఉత్సవాలు నిర్వహిస్తారన్నారు. భక్తులు స్వామివారి ఆరాధన ఉత్సవాలలో పాల్గొని తీర్థ ప్రసాదాలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. **ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో శ్రీ అచలానంద స్వామి ఆశ్రమాలు.** శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి పరమ భక్తులు స్వామి వారిని కళ్ళారా చూసి తరించిన మహనీయులు శ్రీ అచలానంద స్వామి వారు. చిన్నతనం నుంచి ఆధ్యాత్మిక బాటలో నడుస్తూ శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మహిమలను ప్రచారం చేస్తూ స్వామివారి గొప్పతనాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లిన గొప్ప ఆధ్యాత్మికవేత్త శ్రీ అచలానంద స్వాములు వారు. ఆంధ్రప్రదేశ్లోని ఉమ్మడి ప్రకాశం జిల్లా బమ్మేవరం గ్రామంలో పెళ్లూరి పుల్లయ్య శర్మ, వెంకట సుబ్బమ్మ అనే పుణ్య దంపతుల కు శ్రీ అచలానంద స్వామి జన్మించడం జరిగింది. తల్లిదండ్రులు వీరికి శ్రీ వెంకట సీతా రామాంజనేయ శర్మ అనే పేరు పెట్టారు .అనంతరం స్వామి వారుకేవలం ఆరు సంవత్సరాల చిరు ప్రాయంలోనే సాక్షాత్తు ఆ బ్రహ్మంగారి దర్శనం పొందారు .తన జీవితాన్ని సమాజ సేవకు, ధర్మ ప్రచారానికి అంకితం చేసిన ధన్యజీవి వీరు. నిరంతరం శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి కాలజ్ఞానాన్ని ప్రచారం చేస్తూ, గానం చేస్తూ ఊరువాడ ఆయన కాలజ్ఞానాన్ని చాటేవారు. ముఖ్యంగా శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు రచించిన కాలజ్ఞానాన్ని ప్రజల్లోకి తీసుకురావడానికి ఆయన కృషి ఎంతో ఉంది. ఈరోజు మనం చదువుతున్న, వింటున్న వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞాన తత్వాలు మన దాకా చేరాయంటే దానికి ముఖ్య కారకులు శ్రీ అచలానంద స్వామి కృషి ,పట్టుదలే కారణాలు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి తాళపత్రాల్లో ఉన్న కాలజ్ఞానాన్ని ముద్రించడానికి అప్పటి మఠాధిపతులు శ్రీ శ్రీనివాస స్వాముల వారు కొంత సందేహిస్తున్న తరుణంలో శ్రీ అచలానంద స్వామి వారు ధైర్యం చెప్పి వాటిని ముద్రింప చేసేందుకు ఎంతో శ్రమించారు. శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారు నాకు దర్శనమిచ్చి అచ్చు వేయించమన్నారు అని పీఠాధిపతుల వారికి ధైర్యం చెప్పారు. వారి ఆదేశం మేరకు శిష్యులైన అమర కృష్ణమూర్తి పర్యవేక్షణలో శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞానశీ మొదటి ముద్రణ జరిగింది. తొలిముద్రణ పుస్తకంలో స్వామివారి పూర్వ నామం 'పెళ్లూరి వెంకట సీతా రామాంజనేయ శర్మ' అని ముద్రితమై ఉంది. అప్పటినుంచి జన బాహుల్యంలోకి శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి కాలజ్ఞాన తత్వాలు, కీర్తనలు అన్నీ కూడా జనం చెంతకు వెళ్లాయి.. **శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి అనుజ్ఞతో ఆశ్రమాల నిర్మాణం.** శ్రీ అచలానంద స్వాముల వారు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వామి వారి మహిమలను చాటేందుకు తొలుత ఉమ్మడి ఒంగోలులో ఆశ్రమాన్ని నెలకొల్పారు. అనంతరం బ్రహ్మంగారిమఠంలోని తోటపల్లి వద్ద మరో ఆశ్ర మాన్ని నిర్మింప చేశారు. శ్రీ బ్రహ్మంగారి సజీవ సమాధి ఉన్న మఠానికి కేవలం 3 కిలోమీటర్ల దూరంలో ఈ అచలానంద ఆశ్రమం ఉంది. ఈ తోటపల్లి అచలానంద స్వామి ఆశ్రమంలోనే శ్రీ అచలానంద స్వామి వారి సమాధి ఉన్నాయి. ప్రస్తుతం శ్రీ విరజానంద స్వామి వారి ఆధ్వర్యంలో ఈ ఆశ్రమం అద్భుతమైన సేవలను అందిస్తోంది. తోటపల్లి లో గల శ్రీ అచలానంద స్వామి ఆశ్రమంలో శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దర్శనానికి వచ్చే భక్తులకు నిరంతరం ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటలకు వేలాదిమందికి అన్నప్రసాదాన్ని వడ్డిస్తారు. శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి మఠానికి వచ్చిన భక్తులకు నూటికి 90 శాతం మందికి ఇక్కడే అన్న ప్రసాదాన్ని పెట్టడం గొప్ప విశేషం. రోజుకు వేలమంది ఈ భోజనశాలలో భోజనం చేస్తారు. అలాగే అనాధ పిల్లలకు ఉచిత విద్యాదానం చేస్తున్నారు. గో సంరక్షణ శాల ఏర్పాటు చేసి గోవులను సంరక్షిస్తున్నారు. స్వచ్ఛమైన మంచినీటి సరఫరా నిర్వహిస్తున్నారు. పేదలు వివాహాలు చేసుకునేందుకు శ్రీ గోవిందమాంబ పేరుతో కళ్యాణమండపం కూడా నిర్మించారు. ఒంగోలులోని శ్రీ అచలానంద ఆశ్రమంలో కూడా పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాలతో పాటు పైన పేర్కొన్న కార్యక్రమాలు అన్నిటినీ నిర్వహిస్తున్నారు.






PRINTER, PUBLISHER AND OWNED BY **YADATI VIVEKANANDA REDDY YADAV**, AND PRINTED AT M/S GOKUL PUBLICATIONS, # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), PUBLISHED AT # 4-10-19, Ambakapalli Road, Pulivendula - 516390, Ysr/ Kadapa District, (Andhra Pradesh), Editor : YADATI VIVEKANANDA REDDY YADAV, E-Mail :manajanapragathi@gmail.com, Cell : 8125555507 RNI No : - APTEL/2021/80174